ఆంధ్రజ్యోతి



కలువాయిని తిరుపతి జిల్లాలో కలపొద్దు

● గ్రామస్థులు, విద్యార్థుల భారీ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు

కలువాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో కలువాయి మండలాన్ని కలపొద్దంటూ శనివారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు వీవీ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు, యువత పెద్దఎత్తున స్వచ్ఛందంగా తరలి వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ముందుగా అందరూ బస్టాండుకు చేరుకుని మనవహారంగా ఏర్పడి అక్కడి నుంచి తిరుపతి జిల్లా వద్దు... నెల్లూరు జిల్లా ముద్దు అంటూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. కలువాయి మండలాన్ని గూడూరు రెవెన్యూ డివిజన్, తిరుపతి జిల్లాలోకి తీసుకెళుతూ తీసుకున్న నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా తిరుపతిలో కలపడం ఎంతవరకు న్యాయం అని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని నెల్లూరు జిల్లాలోనే కలువాయిని ఉంచాలని విజ్ఞప్తి చేశారు. కాగా, భారీ ర్యాలీ కారణంగా సుమారు గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది.

7న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

నెల్లూరు(విద్య), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరానికి(2025-26) సంబంధించి జాతీయ ఉపకారవేతనం పరీక్ష (ఎన్ఎంఎంఎస్)ను డిసెంబరు 7న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో డాక్టర్ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 18 కేంద్రాల్లో 3,685 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల హాల్ టికెట్‌లు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ బీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో, స్కూల్ లాగిన్‌లో, మనమిత్ర వాట్సాప్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యూడైస్ కోడ్‌ను ఉపయోగించి విద్యార్థుల హాల్‌టిక్‌ట్ డౌన్‌లోడ్ చేసుకుని అందచేయాలని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల బాలుర విజేత నెల్లూరు
వివరాలు 8లో


చెక్కనగిషీ కేంద్రంలో వస్తువులు తయారు చేస్తున్న కళాకారులు

కొయ్య కొరత.. తీరనుందిక!

- ఉదయగిరి చెక్క నగిషీ కేంద్రానికి ఊతం
- ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు
- ఇటీవల పరిశీలించిన అధికారుల బృందం
- త్వరలో ఉడ్ బ్యాంక్ ఏర్పాటుకు సన్నాహాలు

ఉదయగిరిలో రూపుదిద్దుకుంటున్న చెక్క నగిషీ వస్తువులు రాష్ట్ర, దేశస్థాయిలో గుర్తింపు పొందాయి. ఎందరో ప్రముఖులను మెప్పించిన ఈ వస్తువుల ఉత్పత్తి నానాటికి పడిపోతోంది. ఇందుకు ప్రధాన కారణం అవసరమైన కర్ర లభ్యత లేకపోవడమే. అధిక ధరకు కర్ర కొనుగోలు చేసినా అంత ధరకు వస్తువులు విక్రయించుకోలేక కళాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు అవసరమైన కర్రను సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉదయగిరిలో ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు ముమ్మరంగా సన్నాహాలు జరుగుతున్నాయి.


కళాకారుల వాడే కర్ర కొలతలు సేకరిస్తున్న అధికారులు

ఉదయగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరిలోని చెక్కనగిషీ కేంద్రంలో 400 మంది మహిళా కొయ్య కళాకారులు ఉన్నారు. దశాబ్దాల కాలంగా వీరంతా కొయ్యతో చెక్కనగిషీ వస్తువులు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. సుమారు 150 రకాల వస్తువులను తమ స్వహస్తాలతో అందంగా తీర్చిదిద్దుతారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయంగా నిర్వహించే ఎగ్జిబిషన్లలో వస్తువులను విక్రయించి ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారు. ప్రధానంగా కొయ్య వస్తువుల తయారీకి కలివి, నెర్ది, బిల్లనెర్ది, వేప కర్రను వినియోగిస్తున్నారు. వాటిని రిజర్వు ఫారెస్టు, రైతుల పొలాల నుంచి సేకరిస్తారు. అయితే వాటిల్లో కలివి, బిల్లనెర్ది అంతరించిపోగా వేప కర్ర స్థానికంగా దొరుకుతున్నా నెర్ది కర్ర కోసం రిజర్వు ఫారెస్టులోని దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో కర్ర తెచ్చే కూలీలు వాటి ధరలను పెంచడం, తయారు చేసిన వస్తువులు ధర పలకకపోవడంతో చాలా మంది కళాకారులు పనికి దూరంగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది.

● అధికారుల బృందం పరిశీలన

చెక్కనగిషీ కేంద్రంలో కొయ్య కళాకారులు చేస్తున్న వస్తువులు, కర్ర కోసం వారు పడుతున్న ఇబ్బందులను నేరుగా తెలుసుకునేందుకు ఇటీవల విశ్రాంత సీసీఎఫ్ జేఎస్ఎన్ మూర్తి, జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్ బాషాల ఆధ్వర్యంలో అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. ఏ ఏ జాతుల కర్రతో చెక్కనగిషీ వస్తువులు తయారవుతున్నాయి.. ఎంత ధరకు కొనుగోలు చేస్తున్నారు.. ఏడాదికి ఎంత కర్ర అవసరమవుతుంది.. ప్రభుత్వం అందించాలిసన సహాయ సహకారాలు ఏంటి!? తదితర విషయాలను కళాకారులను అడిగి తెలుసుకున్నారు. కళాకారులు వాడుతున్న కర్ర కొలతలు సేకరించారు. దీంతోపాటు అడవుల్లో ఆయా జాతులు అంతరించకుండా అటవీ శాఖ ద్వారా ఉడ్ బ్యాంకు ఏర్పాటు చేసి ఆయా జాతుల మొక్కలను పెంచి వారికి సబ్సిడీపై కర్రను సరఫరా చేసేలా సమగ్ర వివరాలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలో ప్రభుత్వం ఉడ్ బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు చేపట్టనుంది.



● ఉడ్‌బ్యాంకు ఇలా..

వస్తు తయారీకి అవసరమైన జాతుల కర్రను స్థానికంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో పెంచనున్నారు. లేదా లేదా రిజర్వు ఫారెస్ట్‌లోని కర్రను తెచ్చి స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో నిల్వ ఉంచుతారు. ఇక్కడ నుంచి కళాకారులకు అవసరమైన కర్రను తక్కువ ధరకే విక్రయించేలా చర్యలు చేపట్టనున్నారు.

కళకు కొత్త ఊపిరినిచ్చింది



తమ చెక్కనగిషీ కేంద్రంలో కొయ్యతో 150 రకాల వస్తువులు తయారు చేస్తున్నాం. అయితే కొన్నేళ్లుగా అవసరమైన కర్ర లభ్యత కాకపోవడం, అరకొరగా దొరికినా ధర ఎక్కువగా ఉండడంతో అవస్థలు పడుతున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉడ్ బ్యాంకుల ఏర్పాటు చేసి కర్ర సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టడం కళకు కొత్త ఊపిరి ఇచ్చినట్లయ్యింది.

- షేక్ గౌసియాబేగం, కేంద్రం నిర్వాహకురాలు, ఉదయగిరి

ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు



చెక్కనగిషీ వస్తువుల తయారీకి కర్ర కొరతతో కళాకారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉడ్ బ్యాంకు ఏర్పాటు చేసి కర్ర పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతోంది. ఇటీవల చెక్కనగిషీ కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించి, ఇబ్బందులు గుర్తించాం. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. వారి ఆదేశాలతో త్వరలో ఉడ్ బ్యాంకు ఏర్పాటుకు శ్రీకారం చుడుతోంది.

- కే.మహబూబ్‌బాషా, జిల్లా అటవీ శాఖాధికారి, నెల్లూరు

ముంచుకొస్తున్న 'దిత్వా'

● వాయుగుండంగా మారి జిల్లాపై ప్రభావం
● అప్రమత్తమైన అధికార యంత్రాంగం


సోమశిల నుంచి డెల్టాకు వదిలిన నీరు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : శ్రీలంకను అతలాకుతలం చేసిన దిత్వా తుఫాను రాష్ట్రం వైపుగా కదులుతోంది. దీని ప్రభావంతో శనివారం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. నెల్లూరులో సాయంత్రం వర్షం దంచి కొట్టింది. రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆది, సోమవారాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. కాగా జిల్లాలో శనివారం సగటు వర్షపాతం 2 మి.మీ.గా నమోదైంది. అత్యధికంగా కోవూరులో 11.4 మి.మీ. అత్యల్పంగా కలువాయిలో ఒక మి.మీ వర్షపాతం నమోదైంది.

● ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : జేసీ

దిత్వా తుఫాను వాయుగుండగా బలపడే అవకాశం ఉందని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. లోతట్టు, తీరప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు. నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

● కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

భారీ వర్షాల్లో ప్రజలకు అత్యవసరమైన సేవలు అందించేందుకు కలెక్టరేట్‌లో 0861-2331261, 7995576699 నంబర్లతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని జేసీ తెలిపారు. 24గంటలూ ఈ కంట్రోలు రూం పనిచేస్తుందన్నారు. ఆర్డీవో కార్యాలయాల్లో కూడా కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాల ఆదేశించారు.

● సోమశిలకు ఇన్‌ఫ్లో 11,581 క్యూసెక్కులు

అనంతసాగరం : సోమశిల జలాశయానికి శనివారం సాయంత్రం 11,581 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 30 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. తుఫాను కారణంగా వచ్చే వరద మరింతగా పెరగవచ్చని, ఆదివారం నీటి విడుదల పెంచుతామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 70.034 టీఎంసీలు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 2,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. తుఫానుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాగరం తహసీల్దారు జయవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల కాపరులు, జాలర్లు పెన్నా నదిలోకి వెళ్లవద్దని కోరారు.

● కండలేరులో నీటి నిల్వ 57.84 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 57.84 టీఎంసీలుగా ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1900 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 1080 క్యూసెక్కుల అవుట్ ఫ్లోగా ఉందని ఆయన తెలిపారు.

● సంగం బ్యారేజీకి పెరిగిన ప్రవాహం

సంగం : సంగం బ్యారేజీకి శనివారం నీటి ప్రవాహం తగ్గి మళ్లీ పెరిగింది. సోమశిల జలాశయం నుంచి నీటి ప్రవాహం 11 వేల క్యూసెక్కుల నుంచి 30,000లకు పెంచడంతో నీటి ప్రవాహం పెరిగింది. నీటితో సంగం బ్యారేజ్ వద్ద నీటిమట్టం 11 అడుగుల నుంచి 11.5 అడుగులకు పెరిగింది. బ్యారేజ్ 27 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

గంజాయి ముఠాపై కాల్పులు

● గాయపడిన నిందితుడు
● ప్రతిదాడిలో హెడ్ కానిస్టేబుల్‌కి గాయాలు
● పెంచలయ్య హత్య కేసులో 14 మంది గుర్తింపు
● డిసెంబరు 2న జిల్లా బంద్

కోవూరు/నెల్లూరురూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో సీపీఎం నాయకుడు పెంచలయ్యను గంజాయి బ్యాచ్ హతమార్చిన సంఘటన రాష్ట్రంలో సంచలనం రేపింది. నిందితులను పట్టుకునే క్రమంలో పోలీసులు కాల్పులు జరిపా రు. శనివారం వేకువజామున జరిగిన ఈ ఘటన తో జిల్లా వాసులు ఉలిక్కి పడ్డారు. గంజాయి ముఠాకు వ్యతిరేకంగా డిసెంబరు 2న జిల్లా బం ద్‌కు సీపీఎం పిలుపునిచ్చింది. కాగా గంజాయి బ్యాచ్ చేతిలో గాయపడ్డ హెచ్‌కానిస్టేబులు, పోలీ సు కాల్పుల్లో గాయపడ్డ నిందితుడు జీజీహెచ్‌లో పొందుతున్నారు.


పెంచలయ్య భౌతికకాయంపై పార్టీ జెండా కప్పుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

● నిందితుల గుర్తింపు

నెల్లూరు రూరల్ మండలం కల్లూరుపల్లి వద్ద శుక్రవారం సీపీఎం నాయకుడు కొట్టావిట్టం పెంచలయ్య హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో 14 మందికి ప్రమేయం ఉన్నట్లు రూరల్ పోలీసులు గుర్తించారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. వారంతా కోవూరు మండలం సాలుచింత వద్దనున్న షుగర్ ఫ్యాక్టరీలో ఉన్నట్లు సాంకేతికత ఆధారంగా గుర్తించారు. శనివారం వేకువజామున రూరల్ సీఐ గుంజి వేణు, హెచ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ అక్కడకు చేరుకున్నారు. వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో ముఠాలోని ప్రధాన నిందితుడు జేమ్స్ ఆదినారాయణపై కత్తితో దాడి చేశాడు. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. వెంటనే సీఐ వేణు ఆత్మరక్షణ కోసం గాలిలో కాల్పులు జరిపారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో రెండోసారి కాల్పులు జరపగా, జేమ్స్ కాలికి గాయమైంది. గాయపడిన ఇద్దరిని నగరంలోని జీజీహెచ్‌కు తరలించారు.

● నిప్పో సెంటరు నుంచే రెక్కీ

సీపీఎం నేత పెంచలయ్యను హతమార్చేందుకు గంజాయి బ్యాచ్ శుక్రవారం నగరంలోని నిప్పో సెంటరు నుంచే రెక్కీ నిర్వహించినట్లు పోలీసుల విచారణ తేలింది. నిప్పో వద్దనున్న మైథిలి స్కూల్లో పెంచలయ్య కొడుకు నిఖిల్ చదువుతున్నాడు. కుమారుడిని స్కూటర్ పై ఎక్కించుకున్న పెంచలయ్యను గంజాయి ముఠా వెనుక వెంటాడింది. అనంతరం కల్లూరుపల్లి ఆర్సీ ప్రాంతంలో హత్య చేసినట్లు తెలిసింది. కాల్పుల్లో గాయపడ్డ జేమ్స్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా, అతని డిశ్చార్జి అదుపులోకి తీసుకునేందుకు రూరల్ పోలీసులు సిద్ధమయ్యారు. మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నాయి.

● 2న జిల్లా బంద్

పెంచలయ్య హత్యకు నిరసనగా డిసెంబరు 2న జిల్లా బంద్‌కు పిలుపునిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు తెలిపారు. పెంచలయ్య భౌతికకాయానికి నివాళి అర్పించేందుకు శనివారం నెల్లూరుకు వచ్చిన జీజీహెచ్ వద్ద జిల్లా నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కాగా ఆది, సోమ, మంగళవారాల్లో పార్టీ శాఖలన్నీ సంతాప దినాలు పాటించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. అనంతరం పెంచలయ్య భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి కల్లూరుపల్లి వరకు అంతిమయాత్ర నిర్వహించారు.

● గంజాయి బ్యాచ్‌లకు వ్యతిరేకంగా పోరాడదాం

గంజాయి బ్యాచ్‌లకు వ్యతిరేకంగా పోరాడదామంటూ నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జీజీహెచ్ వద్ద పెంచలయ్య మృతదేహాన్ని పరిశీలించి నివాళి అర్పించారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. పెంచలయ్యను హతమార్చిన నిందితులను వదిలే ప్రసక్తే లేదని వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనను జనసేన, సీపీఐ నాయకులు ఖండించారు.

● పాతకక్షల వల్లే హత్య

వర్గపోరు కారణంగానే పెంచలయ్యను శుక్రవారం సాయంత్రం కిరాతకంగా నరికి చంపినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. చక్కెర కర్మాగారం ఆవరణలలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ అజిత వేజండ్ల ఆదేశాల మేరకు పోలీసు దళాలు రంగంలోకి దిగాయన్నారు. 20 ఏళ్ల కిందట మూతపడిన ఫ్యాక్టరీ అడవిని తలపిస్తోంది. దీంతో నిందితులు ఫ్యాక్టరీ ఆవరణలోకి చేరుకున్నారు. నిందితుల సమాచారం అందిన పోలీసులు పకడ్బందీగా అక్కడికి చేరుకున్నారు. అర్ధరాత్రి సమయంలో డ్రోన్ల సహాయంతో నిందితుల్ని గుర్తించారు. కాగా పోలీసులు కాల్పులపై కేసున మోదు చేయనున్నట్లు ఎస్ఐ ముత్యాలరావు తెలిపారు.

నేడు వాటర్ ప్లాంట్లను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

మనుబోలు, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదివారం అక్కంపేట, మనుబోలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెండు వాటర్‌ప్లాంట్లను ప్రారంభించనున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య శనివారం తెలిపారు. సుమారు రూ. 10 లక్షలతో చెన్నూరుకు చెందిన మెట్టు చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీ మణి డిల్లెమ్మ, కుమారుడు రవీంద్రరెడ్డి, కో డలు రజనిలు తాగునీటిశుద్ధి కేంద్రాలకు దాతలుగా వ్యవహరించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12257
వెండి కిలో ధర	రూ. 176300
వెండి ఒక గ్రాము	రూ. 181.30

అరటి రైతు కన్నీటి కష్టాలు

- ప్రభుత్వం ఆదుకోవాలి
- రైతన్నల వేడుకోలు

ఇందుకూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా రైతులు ఎక్కువ మోతాదులో అరటి సాగు చేస్తునానరు. దాదాపు 3నెలల నుంచి అరటి పంట అమ్ముకోలేక రైతన్నలు విలవిలలాడుతున్నారు. అరటికి రేట్లు లేక వ్యాపారస్తులు రాక అరటికాయలు నిండా మాగి పోతున్నాయి. మరల అరటిసాగు చేయాలన్న చేయలేని పరిస్థితి రైతాంగంది. కానీ రైతు మాత్రం ఏదో ఒక పంట పెట్టాలి, ఆదాయం తీసుకోవాలని రైతు తపనపడుతున్నారు. కానీ రైతు అరటి సాగు చేయాలంటే ఒక ఎకరానికి రూ. 1,20,000 నుంచి రూ. 1,50,000 వరకు ఖర్చు పెట్టాల్సివస్తుంది. అరటి పంట సంవత్సరం పొడవునా గుంటూరు జిల్లా పిల్లలను పోషించినట్లు అరటిని సాగు చేయాలి. కానీ సంవత్సరం నాడు ఆ పంట రైతు చేతికి వస్తుందో లేదో చెప్పలేం. అరటి కోతకు వచ్చిన టైంలో గాలి వచ్చిన రైతు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల సంభవించిన మొంథా తుఫానుకు అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు రైతుకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదు. గిట్టుబాటు ధర లేక రైతులు చాలా చోట్ల వేసిన పంటను అరటి గెలలతో పాటు దున్ని వేస్తున్నారు. తియ్యని అరటిని పండిస్తున్న రైతుకు మాత్రం


సాగు చేస్తున్న అరటి పంట

చేదు అనుభవం మిగులుతోంది. రసాయన ఎరువులు, పురుగు మందులు, అరటి చెట్లకు సపోర్టుగా కట్టె కర్రల రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. ఉత్పత్తి ఖర్చులు రెట్టింపయ్యాయి. అరటి మద్దతు ధర మాత్రం టన్ను అరటి కాయలు రూ. 12వేల నుంచి రూ.15 వేల వరకు ఇస్తే గిట్టిక్కుతామని రైతులు చెబుతున్నారు. ఎంత మొర పెట్టుకున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని దళారుల చేతిలో మోసపోతున్నామని రైతులు వాపోతున్నారు. తుఫాను ఈదురు గాలుల వంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భాలలో ఎక్కువ నష్టపోయేది అరటి రైతులే. పంటల బీమా వంటి పథకం ఇవ్వడం లేదు. ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపోతున్న తమను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టాలని, కనీస మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని అరటి రైతులు కోరుతున్నారు. ఉద్యాన శాఖ ద్వారా సబ్సిడీలు కూడా అందించాలని రైతులు కోరుతున్నారు.

పంట చేతి కొస్తుందో.. లేదో!



అరటి సాగు చేయాలంటే ఎకరాకు రూ.1 లక్షా 20 వేల నుంచి రూ. 1 లక్షా 50 వేల వరకు ఖర్చవుతుంది. సంవత్సరం తర్వాత పంట చేతికి వస్తుందో లేదో తెలియదు. ఇటీవల మొంథా తుఫాను ధాటికి చేతికొచ్చిన పంట నేల పాలైంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

- కూకటి వెంకటేశ్వర్లురెడ్డి, అరటి రైతు

సెల్‌ఫోన్లు వద్దు.. ఆటలు ముద్దు!

- జిల్లా యువజన అధికారి మహేంద్ర

పొదలకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సెల్‌ఫోన్లు విడనాడి ఆటలను ఆడాలని జిల్లా యువజన అధికారి ఎ.మహేంద్ర, పొదలకూరు పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, మై భారత్ నెల్లూరు ఆధ్వర్యంలో ట్రీస్ సేవా సంస్థ సహకారంతో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం మేరా యువ భారత్ బ్లాక్ స్థాయి క్రీడాకారులు జరిగాయి. ఈ క్రీడా పోటీలను స్థానిక ఎంపీడీవో డి.నరసింహరావు ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. వాలీబాల్, 100 మీటర్ల పరుగు పందెం, ఖోఖో, షాట్‌పుట్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి మహేంద్ర, పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ, ట్రీస్ సేవా సంస్థ ప్రెసిడెంట్ నౌరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు ఏదో ఒక క్రీడను అలవర్చుకోవాలన్నారు. కళాశాలలోను అన్నీ రకాల క్రీడా వసతులను కల్పించామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరులోని వివిధ కళాశాలలు, పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంటా మల్లికార్జున్‌యాదవ్, కలిచేటి శ్రీనివాసులురెడ్డి, పెంచలనాయుడు, అలుపూరు శ్రీనివాసులు, నెహ్రూ యువ కేంద్రం సభ్యులు మైథిలి, శోభన్, అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది, పీఈటీ సురేష్, సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రత

తోటపల్లిగూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎన్‌డీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎన్ఎస్ఎస్ పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా వివిధ రకాల చెట్లను నాటడం జరిగింది. నాటిన చెట్ల ప్రజలకు ఎంతో ప్రయోజనాత్మకంగా ఉంటాయని, విద్యార్థులు ప్రజలకు చెట్ల ప్రయోజనాలను వివరించారు. చెట్లు వాతావరణాన్ని గాలిలో ఆమ్లజనిని పెంచుతాయని, పక్షులు, జీవులకు ఆశ్రయం ఇస్తాయని, వర్షపాతం పెరిగేలా సహకరిస్తాయని, గ్రామాలు పచ్చగా, చల్లగా మారేందుకు చెట్లు ఎంతో ఉపయోగమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యుఎస్ కృష్ణప్రసాద్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారి ఎం.విజయమ్మ, ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసులు, జె.గోపి, పి.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణపై రైతులకు అవగాహన

ముత్తుకూరు, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి) : మల్లూరు గ్రామంలో రైతన్నా.. మీ కోసం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సమక్షంలో శనివారం రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసా యాధికారి జోత్స్నరాణి వ్యవసాయ శాఖ ద్వారా అందించే పథకాలు గురించి వివరించారు. తదుపరి స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ వినీత, డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ రబీ సీజన్ కోసం మండలంలో వరి పంట నారుమడి దశలో ఉందన్నారు. నారుమడిలో చేపట్టాలిసన యాజమాన్య పద్ధతులు, పోషక యాజమాన్యం గురించి వివరించారు. పచ్చిరొట్ట వేసిన రైతులు పచ్చిరొట్ట పైరుని పొలంలో కలియదున్నిన 15 రోజుల తర్వాత మాత్రమే ప్రధాన పొలంలో వరినాట్లు వేసుకోవాలని తెలియజేశారు. వరి పంటను ఆశించే చీడపీడలు, సమగ్ర సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఈగల్ ఫౌండేషన్ అందజేసిన పోషకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి దేవరాజ్, గ్రామ వ్యవసాయ సహాయకులు గోవర్ధన్, జగదీష్, సీగల్ ఫౌండేషన్ ప్రతినిధి శివ, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రికలను విడుదల చేస్తున్న ఎంఏఓ జోత్స్నరాణి

తాళ్ల వెంకయ్య కుటుంబానికి సీపీఎం రాష్ట్ర నేతల పరామర్శ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ పెనుబల్లి సర్పంచు తాళ్ళ వెంకయ్య కుటుంబ సభ్యులను రాష్ట్ర సీపీఎం నాయకుడు వి. శ్రీనివాసరావు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్, సీపీఎం జిల్లా కా ర్యదర్శి మూలం రమేష్ శని వారం పెనుబల్లిలోని తాళ్ల వెంకయ్య నివాసంలో వారి కుటుంబ సభ్యులను పరా మర్శించి వెంకయ్య చిత్రపటానికి జోహార్లు అర్పించారు. గత కొంత కాలంగా తాళ్ళ వెంకయ్య అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందిన విష యం విదితమే. ఈమేరకు శనివారం సీపీఎం రాష్ట్ర నేతలు, జిల్లా కార్యదర్శి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించి వారి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట పలువురు సీపీఎం నాయ కులు, కార్యకర్తలున్నారు.


వెంకయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం రాష్ట్రనేతలు

తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ

సంగం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక సర్కిల్ కార్యాలయంలో మాట్లా డుతూ తుఫాన్ ప్రభావంతో సర్కిల్ పరిధిలోని సంగం, ఏయస్ పేట, చేజర్ల గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలతోపాటు పెన్నానది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షాల వల్ల వాగులు, వంకలు ప్రవహిస్తాయి. సోమశిలకు ఎగువున రాయలసీమ జిల్లాలో భారీ వర్షాలు పడితే సోమశిల జలాశయం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రజలు వాగులు, వంకలు, నదుల వద్దకు, దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. వర్షాల సమయంలో ఇబ్బందులు తలెత్తిన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కాగా, దిత్వా తుఫాన్ ప్రభావంతో శనివారం నుంచి సంగంలో వర్షం కురుస్తోంది. వృద్ధులు, పిల్లలు ఇళ్ల నుంచి బయటకు రాలేక ఇబ్బంది పడ్డారు.


మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

పెన్నా పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చేజర్ల: దిత్వ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేజర్ల తహసీల్దారు ఆర్ మస్తానయ్య తెలియజేశారు. ముఖ్యంగా సోమశిల జాలాశయం నుండి ఏ క్షణమైనా పెన్నానదికి నీళ్ళు విడుదల చేస్తారన్న ప్రాజెక్ట్ అధికారుల ఆదేశాలతో చేజర్ల మండలంలో పెన్నానది పరీవాహక గ్రామాలైన కోటితీర్థం గ్రామం నుండి నడిగడ్డ అగ్రహారం వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

విడవలూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా సర్వం కోల్పోయిన వరద బాధితులను ప్రతిఒక్కరు చేయూతని ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు మేరకు ఏఆర్డీ స్వచ్ఛంద సంస్థ బాధిత గిరిజనులకు నిత్యవసర సరుకులను అం దజేయటానికి ముందుకు వచ్చిందని టీడీపీ యువ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఊటుకూరు గ్రామంలో ఏఆర్డీ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు శనివారం అయన నిత్యవసరసరుకులను అందజేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మొంథా తుఫాను బాధితులను అదుకోవటానికి ఏఆర్డీ స్వచ్ఛంధ సంస్థ ముందుకు రావటం అభినందనీయమన్నారు. ఈ సంస్థద్వారా మండలంలోని వీరారెడ్డిపాళెం, అలగానిపాడు, ఊటుకూరు, శంభుని పాళెంలోని సుమారు 267 గిరిజన కుటుంబాలకు నిత్యవసర సరుకులను అందజేయ్యటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ కోవూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొమరగిరి దయాకర్, గిరిజన నాయకులు కొండా ర ఘు, పుల్లయ్య, వాసు, చౌటూరు శ్రీను,టీడీపీ నాయకులు తూళ్లూరు మాధవ్, ఏఆర్డీ సంస్థ నిర్వాహకులు రమేష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులను అందజేస్తున్న బెజవాడ వంశీకృష్ణారెడ్డి

కృష్ణపట్నం పోర్టులో మూడో నంబరు ప్రమాద హెచ్చరిక!

- అప్రమత్తమైన అధికారులు

ముత్తుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాను తీవ్రత పెరిగిన నేపథ్యంలో శనివారం అదానీ కృష్ణపట్నం పోర్టులో 3వ నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగుర వేశారు. తుఫాను తీవ్రత అధికంగా ఉండవచ్చున్న సూచనలతో తహసీల్దారు స్వప్న మండల అధికారులను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాలలో పరిస్థితులను సమీక్షించారు. చలివేంద్ర, బలిజపాలెం, కృష్ణపట్నం, ముత్తుకూరు కాలనీల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. వర్షాలతో ఇబ్బందులు ఏర్పడితే సమీప సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. లోతట్టు గ్రామాల ప్రజలు ఇబ్బందిపడకుండా ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకుంటుందన్నారు. సముద్రం అలజడిగా ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, పర్యాటకులు ఎవరూ కృష్ణపట్నం తీరానికి రావద్దని ఎస్ఐ జేవీ శ్రీనివాసులు రెడ్డి సూచించారు. సముద్ర తీరంలో ఎవరూ సంచరించకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మనుబోలు: వాతావరణశాఖ సూచనలతో, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాబోయే మూడురోజుల్లో దిత్వా తుపాను ప్రభావం ఉంటుందని, కావున రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలతో ఆమె శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ సమస్యలను, ఇబ్బందులను కనుగొని, పరిష్కరించేందుకు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలంలో ఏ గ్రామంలోనైనా రాబోయే భారీ వర్షాలకు ఇబ్బందులు పడుతుంటే వెంటనే 9989502066 నంబరుకు సమాచారం ఇవ్వవచ్చునన్నారు. వెంటనే సంఘటనా స్థలానికి రెవెన్యూ సిబ్బందిని పంపి సమస్యను పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు వర్షాలు ముగిసే వరకు అవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్, సర్వేయర్ అనుదీప్, ఆర్ఐ. అరుణ్ బాబు పాల్గొన్నారు.


ముత్తుకూరు: కాలనీవాసులతో మాట్లాడుతున్న తహసీల్దారు స్వప్న


మనుబోలు : వీఆర్‌వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

రాపూరు విలీనమైతే జల వివాదాలు


వినతి పత్రం అందజేస్తున్న మిడతల రమేష్

రాపూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాపూరు మండలం తిరుపతి జిల్లాలో విలీనం అయితే రెండు జిల్లాల మధ్య జల వివాదాలు ఏర్పడే అవకాశం ఉందని బీజేపీ రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ తెలిపారు. శనివారం తిరుపతిలో తెలుగు గంగ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ సునీల్ నాయక్‌కు బీజేపీ రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డిమాండ్ పత్రం సమర్పించారు. రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో కలిపితే కండలేరు డ్యాం రెండుగా విభజించాల్సి వస్తుందన్నారు. వందల సంవత్సరాల నాటి కండలేరు సహజ వాగుపై ఆధారపడి ఉన్న రైతాంగం నీటి హక్కులను కోల్పోతారన్నారు. కండలేరు నీటిమట్టం కంటే ఎత్తుగా ఉన్న పొదలకూరు మండలంలోని 14 గ్రామాలకు నీటి లభ్యత మీద ప్రతికూల పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, దేవా రెడ్డి, గోపాల్ రెడ్డి, తరుణ్ కృష్ణ, శరవణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కళ్యాణం


విరాళం అందజేస్తున్న వినాయక రవిరెడ్డి దంపతులు

రాపూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో లక్ష్మీనృసింహుడికి శనివారం తెల్లవారుజామున అభిషేకాలు అనంతరం చందనాలంకారసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం దేవేరులతో కళ్యాణం, సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, రాత్రి ఊంజల్ సేవలను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వ హించారు.

నిత్యాన్నదానానికి విరాళం

పెంచలకోన సన్నిధిలో నిర్వహించే శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ వాసి తిక్కవరపు వినాయక రవిరెడ్డి, శాంతి ప్రియదర్శిని దంపతులు ఆన్ లైన్ ద్వారా రూ. 1,10,116 ఆలయ ఉపకమీషనర్ సమక్షంలో నిత్యాన్నదాన పథకం అకౌంట్‌కు జమ చేశారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శనం, ప్రసాదాలు అందజేశామని ఆలయ అధికారులు తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం!


కార్యక్రమంలో పాల్గొన్న చెన్ను అశోక్ రెడ్డి

రాపూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాపూరు మండల అధ్యక్షులు చెన్ను అశోక్ రెడ్డి అన్నారు. రాపూరు మండలంలోని వీరాయపాలెం గ్రామంలో "రైతన్న-మీకోసం" కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు మద్దతు ధర వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. వీరాయపాలెం గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి రైతులను చంద్రబాబు నాయుడు ఏ విధంగా ఆదుకుంటున్నారో ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సొసైటీ అధ్యక్షులు దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మూరం రెడ్డి మధు రెడ్డి, టీడీపీ స్టేట్ ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చిగల్ల రత్నయ్య, మైనారిటీ నాయకులు చానా, కూనిపోగు కన్నయ్య, వ్యవసాయాధికారి సోము సుందర్, నాయకులు పాల్గొన్నారు.

కలువాయిని నెల్లూరులోనే కొనసాగించాలి : పీఆర్టీయూ

కలువాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోకి కలువాయి మండలాన్ని మార్పు చేయకుండా నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెవీ నారా యణ, ఐ ప్రసన్నకుమార్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

పీఏఎల్ ల్యాబ్ ప్రారంభం

చేజర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లి గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాలలో శనివారం పీఏఎల్ ల్యాబ్‌ను సమగ్ర శిక్షణా అకాడమిక్ మానటరింగ్ అధికారి సుధీర్‌బాబు డిసివో ప్రభావతమ్మతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

C.R.I.M.E N.E.W.S

వదిన, మరదలిపై గొడ్డలితో దాడి


క్షతగాత్రుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి ఎస్సీ కాలనీ సమీప అటవీ ప్రాంతంలో వదిన, మరదలిపై గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేసిన సంఘటన శనివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన పంబా లక్ష్మీనరసమ్మ, జజ్జూరి కవితలు కాలనీ సమీపాన గల అటవీ ప్రాంతానికి కట్టెల కోసం వెళ్లారు. ఈ తరుణంలో వారి వెనుక అటవీ ప్రాంతానికి వెళ్లిన బొబ్బా ఆదినారాయణ వరుసకు వదినైన లక్ష్మీనరసమ్మ, సొంత మరదలైన కవితలపై గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో లక్ష్మీనరసమ్మ, కవితకు తీవ్ర గాయాలు కాగా అతని నుంచి తప్పించుకుని వారు కాలనీకి చేరుకున్నారు. కాలనీ వాసులు 108 వాహనానికి సమాచారం అందించి వారిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చెడు వ్యసనాలకు బానిసైన ఆదినారాయణను వారు మందలిస్తుండడంతో అది మనసులో పెట్టుకుని దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి వైద్యశాలకు చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వకుంటే చంపుతా..

- కత్తితో వదినను బెదిరించిన మరిది

నెల్లూరు(క్రైం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని, లేకుంటే చంపుతానని కత్తితో వదినను బెదిరించిన మరిదిపై సంతపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని సంతపేట కామాక్షినగర్‌లో షేక్ షమీమ్, సతీష్ దంపతులు నివాసం ఉంటున్నారు. కపాడిపాలెం రాయపువీధిలో షమీమ్ మేనత్త ముంతాజ్ నివాసం ఉంటోంది. అప్పుడప్పుడు మేనత్త బాగోగులు చూసుకునేందుకు షమీమ్ కపాడిపాలెం వెళ్లేది. ఈ క్రమంలో ఈనెల 27వ తేది రాత్రి 7 గంటల సమయంలో ఆమె మేనత్తను చూసేందుకు వెళ్లగా అక్కడే ఉన్న మరిది షేక్ సత్తార్ అసభ్యకరంగా మాట్లాడడంతోపాటు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని కూరగాయల కత్తితో బెదిరించడంతో ఆమె భయపడి తన వద్ద ఉన్న రూ.1000 అతనికి ఇచ్చింది. అయితే ఈ విషయమై శనివారం ఆమె సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో బెదిరించి నగదు దోచుకెళ్లాడు...!

నెల్లూరు(క్రైం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పానీపూరి వ్యాపారస్తుడును కత్తితో బెదిరించి నగదు దోచుకెళ్లిన ఘటనపై శనివారం సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు పొర్లుకట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్న సంజయ్ కుమార్ కాపువీధిలో ఆరు నెలలుగా పానీపూరి బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఈనెల 26వ తేది రాత్రి 8 గంటల సమయంలో శివాజీ అనే వ్యక్తి పానీపూరి తిని వంద రూపాయలకు చిల్లర ఉందా అని అడిగాడు. సంజయ్‌కుమార్ గల్లాపెట్టెలో చిల్లరు కోసం చూస్తుండగా శివాజీ కత్తి చూపించి చెంపపై కొట్టి నగదు ఇవ్వాలని బెదిరించాడు. దీంతో ఆయన రూ.2వేల ఇవ్వడంతో అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ మేరకు శనివారం బాధితుడు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమిస్తున్నానని నమ్మించి మోసగించాడు

నెల్లూరు(క్రైం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ యువతిని ప్రేమ పేరుతో వంచించి మెసగించిన యువకుడిపై చిన్న బజారు పోలీసులు శనివారం చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఉస్మాన్‌సాహెబ్‌పేట ప్రాంతంలో నివాసం ఉంటున్న ఓ యువతి డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది. కలిగిరి మండలం నరసారెడ్డిపాలెంకు చెందిన మనోహర్‌తో తొమ్మిది నెలల కిందట పరిచయం అయ్యింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో ఇద్దరు కలిసి ఇంట్లో నుంచి వెళ్లిపోయి వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సెప్టెంబరు 22వ తేదీన మనోహర్ ఆ యువతిని మోటారు సైకిల్లో ఎక్కించుకుని ముత్తుకూరు బస్టాండు ప్రాంతంలోని ఓ లేడీ హాస్టల్‌లో చేర్పించాడు. మరుసటి రోజు ఆమెను తన గదికి తీసుకువెళ్లి పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబరుచుకున్నాడు. అనంతరం ఆ యువతిని మనోహర్ తన స్వగ్రామానికి తీసుకుని వెళ్లగా అతని తల్లిదండ్రులు త్వరలోనే యువతి తల్లిదండ్రులతో మాట్లాడి పెళ్లి చేస్తామని చెప్పారు. దీంతో మనోహర్ యువతిని ఆత్మకూరు బస్టాండు వద్ద వదిలి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి బాధిత యువతి మనోహర్, అతని తల్లిదండ్రులకు ఫోన్ చేస్తుంటే వారు స్పందించలేదు. దీంతో మోసపోయానని గ్రహించి ఆ యువతి శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైకుల చోరీపై కేసుల నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసిన బైక్‌లను గుర్తుతెలియని దుండగులు అపహరించుకు వెళ్లిన ఘటనలపై చిన్నబజారు పోలీసులు శనివారం కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రంగానాయకులపేట ఇసుకడొంక ప్రాంతానికి చెందిన అబ్దుల్ షరీఫ్ ఏసీ కూరగాయల మార్కెట్‌లో కూరగాయల వ్యాపారి వద్ద గుమస్తాగా పనిచేస్తున్నారు. ఈనెల 17వ తేదీన ఆయన తన బైక్‌ను మార్కెట్ ఎదురుగా పార్క్ చేసి ఉండగా గుర్తుతెలియని దుండగులు అపహరించుకు వెళ్లారు.

- హరనాథపురంకు చెందిన శ్రీనివాసులు ఈనెల 14వ తేదీన సాయంత్రం తన కుటుంబ సభ్యులతో కలిసి బైక్‌పై ఎస్2 థియేటర్‌లో సినిమా చూసేందుకు వెళ్లారు. బైక్‌ను థియేటర్ బయట పార్క్ చేసి సినిమా చూసి బయటకు వచ్చే సరికి బైక్ కన్పించలేదు. ఈ మేరకు బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- హరనాథపురంకు చెందిన శ్రీనివాసులు రామ్మూర్తినగర్‌లో కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తున్నారు. ఈనెల 18వ తేదీన ఆయన కూరగాయాల మార్కెట్ వద్ద బైక్ పార్క్‌చేసి కూరగాయలు తీసుకొని బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- సుందరయ్యనగర్ పుత్తాఎస్టేట్ ప్రాంతానికి చెందిన షేక్ అబ్దులా ఏసీ కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 14వ తేది తెల్లవారుజామున ఆయన తన బైక్‌ను మార్కెట్ బయట పార్క్ చేయగా గుర్తుతెలియని దుండగులు అపహరించుకు వెళ్లారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదులపై చిన్నబజారు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	260
కోడిగుడ్ల ధర (100): 640	

బీజేపీలో పలువురి చేరిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నబజారు బీజేపీ కార్యాలయంలో శనివారం పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీలో పలువురు మహిళలు చేరడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



సమాజానికి
దిశా నిర్దేశం భగవద్గీత

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో కులమత ప్రాంతాలకతీతంగా సమాజానికి దశ దిశా నిర్దేశించి నైతిక విలువలు పెంచి సౌభాగ్యాన్ని పెంపొందించేది భగవద్గీత మాత్రమేనని గీతా ప్రబోధక్ షేక్.నజీర్ బాషా గురూజీ అన్నారు. శనివారం మూలాపేట శివగిరికాలనీ గీతా వైభవ ట్రస్ట్ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ దేశాల్లో భగవద్గీతను ప్రామాణికంగా తీసుకున్నారని పేర్కొన్నారు. కమ్యూనిస్టు దేశమైన చైనా కూడా భగవద్గీతను ఆదరిస్తుందన్నారు. యుగాలు మారిన భగవద్గీత ప్రాధాన్యత తగ్గలేదన్నారు. డిసెంబరు 1 ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మి దేవాలయ ప్రాంగణంలో శ్రీరాధాకృష్ణ ధ్యాన మందిరంలో సుమారు 3వేల మంది విద్యార్థులతో గీతాచాలీసా 40శ్లోకాల సంపుటి సామూహిక పారాయణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, దీపావెంకట్, బ్రహ్మశ్రీ రాధామనోహన్‌దాస్, మైసూరు నుంచి బ్రహ్మశ్రీ కళ్యాణశర్మ, పిరమిడ్ ధ్యాన సీనియర్ వైస్ ఛైర్మన్ జక్కా రాఘవయ్య, తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన బ్రోచరు విడుదల చేశారు.

819 మందికి
పక్కా గృహాల కేటాయింపు

● టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి


ఇంటి మంజూరు పత్రాన్ని అందచేస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి పార్టీల ప్రభుత్వం ఏర్పడ్డాక నెల్లూరురూరల్ నియోజకవర్గంలో 819 మందికి ప్రభుత్వ పక్కా గృహాలను కేటాయించినట్లు టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి తెలిపారు. శనివారం బుజబుజ నెల్లూరు వద్ద గృహాలు మంజూరైన లబ్ధిదారులకు అనుమతి పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ పక్కా గృహం కేటాయిస్తామన్నారు. ఈ మేరకు ప్రజలు ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు కావాల్సిన అన్ని సంక్షేమ పథకాలను సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి అందచేస్తుందన్నారు. ఆర్థికంగా సర్కారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజల శ్రేయస్సే తొలి లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహగిరి, నాయకులు జెన్ని రమణయ్య, పెంచలనాయుడు, జలదంకి సుధాకర్, సాబీర్‌ఖాన్, నరేష్, మాతంగి కృష్ణలు పాల్గొన్నారు.

డీఎస్‌ఏ సిబ్బందికి బియ్యం పంపిణీ


బియ్యం పంపిణీ చేస్తున్న వాకర్స్ సభ్యులు

నెల్లూరు(విద్య), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిబ్బందికి స్మైల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బియ్యం బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ మదార్ మాట్లాడుతూ డీఎస్‌ఏలో గ్రౌండ్స్‌మెన్స్‌గా, స్వీపర్స్‌గా, అటెండర్‌లుగా పనిచేసే సిబ్బందికి వేతనాలు సకాలంలో అందక ఇబ్బందులు పడుతుండడంతో వారికి తమవంతు చేయూతగా బియ్యం అందచేశామన్నారు. అసోసియేష్ సభ్యుడు యస్థాని బియ్యం పంపిణీకి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి షేక్.అజ్మీర్‌బాషా, కోశాధికారి బీ.వెంకటనారాయణ, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు నేతాజీ సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, కమ్రుద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి
మండల పూజలు


సర్పదోష నివారణ పూజ చేస్తున్న కేరళ తంత్రి

నెల్లూరు(సాంస్కృతికం) నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని వేదాయపాలెంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి కేరళ సంప్రదాయ మండల పూజలు శనివారం ఘనంగా జరిగాయి. తొలుత అయ్యప్పస్వామి నిర్మాల్య దర్శనం, పాలాభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం, ఉచ్ఛపూజ జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, అత్తాళపూజ, పడికర్పూర దీపం, హరిహరాసనంలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కేరళ సంప్రదాయంలో అశ్లేష బలిపూజ, సర్పదోష శాంతి పూజలు ఘనంగా జరిగాయి. అలాగే మహామృత్యుంజయ హోమాలు, సుదర్శన హోమాలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షించారు. కమిటీ సభ్యులు కత్తి మోహన్‌రావు, కేజీ శంకరన్, బొగ్గుల మురళీమోహన్‌రెడ్డి, పావలా ప్రసాద్, పలువురు అయ్యప్పస్వామి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో
ఉడయవర్ల ఆలయం!

● 9 నుంచి అధ్యాయనోత్సవాలు
● ఆందోళనలో భక్తులు


శిథిలావస్థకు చేరిన నవాబుపేట ఉడయవర్లు ఆలయం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంతాన భాగ్యం కల్పించే శ్రీదేవి భూదేవి సమేత ఆదికేశవస్వామి పురాతన ఆలయం శిథిలావస్థకు చేరింది. నవాబుపేటలో ఉడయవర్లు దేవస్థానంగా పేరొందిన ఈ ఆలయం దాదాపు 300 ఏళ్ల క్రితం నిర్మించబడింది. పల్లాప్రోలు వంశీకులు 6 తరాలుగా వంశపారంపర్య అర్చకత్వం చేస్తున్నారు. ఆలయ స్థలం విశిష్టత, భక్తుల విశ్వాసంతో ఈ ఆలయంలో సంప్రదాయ పద్ధతిలో నిత్య పూజలు, ఉత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. శ్రీపెరంబుదూరు భగవద్రామానుజులస్వామికి ఆంధ్రప్రదేశ్‌లో రెండు ఆలయాలు ప్రీతిపాత్రమైనవి. రామానుజుల పేరున నరసాపురంలోని ఇంబేరుమన్నార్ ఆలయం, నెల్లూరు నగరం నవాబుపేటలోని ఉడయవర్లు దేవస్థానం. శ్రీపెరంబుదూరు నుంచి ఉత్సవమూర్తులను నెల్లూరు మీదుగా నరసాపురంకు భక్తులు తీసుకెళ్తుండగా ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రాంతంలో రామానుజుల స్వామివారి ఉత్సవ మూర్తులను విడిది చేయించి నరసాపురం భక్తులకు వసంతాలు కల్పించారని చరిత్ర. భగవద్‌రామానుజులు (ఉడయవర్లు) విడిది చేసిన స్థలంలో ఆలయం నిర్మాణంకు ఆ సమయంలో భక్తులు శ్రీకారం చుట్టారని పెద్దలు తెలిపారు. దాతలు సహకారంతో పల్లాప్రోలు పార్థాచార్యులు శ్రీదేవి భూదేవి సమేత ఆదికేశవ స్వామి ఆలయం నిర్మించారు. అప్పటి వరకు అర్చకులుగా వ్యవహరిస్తున్న పార్థాచార్యులకు సంతానం కలిగింది. అప్పటి నుంచి పల్లాప్రోలు వంశీకులే వంశ పారంపర్యం అర్చకులుగా వ్యవహరిస్తున్నారు. 1979లో ఈ ఆలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోకి వచ్చింది. ఈ ఆలయంలో పూజలు చేస్తే స్వామివారి కృపతో సంతాన అభివృద్ధితోపాటు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతారని ప్రతీతి. ఇక్కడ దాతలు సహకారంతో అన్నీ ఉత్సవాలు జరుగుతున్నాయి. అయితే ప్రస్తుతం ప్రధాన ఆలయంతో పాటు ఆదిలక్ష్మి ఆలయం, వాహనశాల కల్యాణ మండపం, అర్చక నిలయం, వంట శాలలు శిథిలావస్థకు చేరాయి. అందులో ప్రధాన ఆలయం మినహాయించి మిగిలిన వాటికి మరమ్మతులు చేస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయం పునఃనిర్మాణంకు దాతలు, ప్రభుత్వం సహకారం అందిస్తే 2026 ఫిబ్రవరి నుంచి ప్రధాన ఆలయాన్ని పునః నిర్మాణం చేపట్టాలని వంశపారంపర్య అర్చకులు పల్లాప్రోలు రామకృష్ణమాచార్యులు, ఆయన కుమారులు సంకల్పించారు. భగవద్ అనుగ్రహంతో ఆలయం పునఃనిర్మాణం జరగాలని స్థానిక భక్తులు ఆశిస్తున్నారు.


మరమ్మతులు జరుగుతున్న కల్యాణ మండపం


మరమ్మతులు పూర్తయిన అలంకారం మండపం

● డిసెంబరు 9 నుంచి అధ్యయనోత్సవాలు

నవాబుపేట ఉడయవర్లు దేవస్థానంలో డిసెంబరు 9 నుంచి జనవరి (2026) 9వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వంశపారంపర్య అర్చకులు, పల్లాప్రోలు రామకృష్ణమాచార్యులు తెలిపారు. డిసెంబరు 16 నుంచి ధనుర్మాసం పూజలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ ఉత్సవాలు కనుమ పండుగ వరకు జరుగుతాయని భక్తులందరూ పాల్గొనాలని కోరారు. అయితే ఆలయం శిథిలావస్థలో ఉండడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు.

కాకాణి.. నిజం తెలుసుకుని మాట్లాడు..!

● నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : సీపీఎం నాయకుడు పెంచలయ్య హత్యకు కుట్ర చేసి, అమలు చేసిన గంజాయి బ్యాచ్ టీడీపీకి చెందిన వారంటూ మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు నిజం కాదని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో మాట్లాడారు. కాకాణి నిజం తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. కల్లూరిపల్లికి చెందిన అరవ కామాక్షి, ఆమె బృందం ఈ హత్య ఘటనలో ప్రధానంగా ఉన్నారని, వారంత వైసీపీ నాయకులగానే నేటికీ కొనసాగుతున్నారని స్పష్టం చేశారు. ఈ విషయం అందరికీ తెలుసన్నారు. టీడీపీ పైన బురద జల్లే ప్రయత్నంలో కాకాణి వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గంజాయి ఈ రాష్ట్రంలో మాఫీయాగా తయారవడానికి గత వైసీపీ ప్రభుత్వమే కారణమని, అప్పుడే ఈ ముఠాలకు పునాదులు పడ్డాయన్నారు. పెంచలయ్య మరణిస్తే కనీసం వైసీపీకి చెందిన ఒక్క నాయకుడు కూడా రాలేదని, ఇంతకన్నా దౌర్భాగ్యం మరొకటి ఉండదన్నారు. సర్వేపల్లిలో రాజకీయాలు చేసే నువ్వు రూరల్ రాజకీయాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. అంతకు ముందు ఆయన జీజీహెచ్‌లో పెంచలయ్య మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


జీజీహెచ్ వద్ద హత్య ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకుంటున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పీఎంపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌కి సన్మానం

నెల్లూరు(వైద్యం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి జాతీయస్థాయి ఉత్తమ సేవా అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని 25వ డివిజన్ కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి పేర్కొన్నారు. శనివారం బుజబుజనెల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శాఖవరపు వేణుగోపాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఉచిత వైద్యశిబిరాలతో పాటు రక్తదానం, వైద్య అవగాహన సదస్సులు నిర్వహించడంతో ఈ అవార్డు దక్కిందన్నారు. ఇటీవల జరిగిన జాతీయ సాంస్కృతిక ఉత్సవాలలో ఈ పురస్కారం అందుకున్నారని చెప్పారు. అవార్డు గ్రహీత శాఖవరపు మాట్లాడుతూ గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సామాజిక కార్యక్రమాలు పెద్ద స్థాయిలో నిర్వహించే బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్ని రమణయ్య, ఆదిశేషు, మాతంగి కృష్ణ, దూడల ప్రసాద్‌రావు, గుంటి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.


వేణుగోపాల్‌ను శాలువాతో సన్మానిస్తున్న నేతలు

అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేస్తాం

ఉదయగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరలో పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని సమగ్ర శిక్ష ఆడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వీ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మనబడి-మన భవిష్యత్తు-2 కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 1,356 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయన్నారు. వాటిలో 657 భవనాలు పూర్తికాగా 699 భవనాల నిర్మాణం 80శాతం పూర్తయిందన్నారు. పేరెంట్స్ మేనేజ్‌మెంట్ కమిటీ ఖాతాల్లో రూ.6.50 కోట్లు నిధులు ఉన్నాయని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఆ నిధులతో మిగిలిన 20 శాతం పనులు పూర్తిచేసి అదనపు తరగతి గదులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

స్త్రీశక్తి పథకంతో ఆర్టీసీకి పెరిగిన రాబడి : ఆర్‌ఎం

ఉదయగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన స్త్రీశక్తి పథకంతో ఆర్టీసీకి రాబడి పెరిగిందని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ షేక్ షమీమ్ పేర్కొన్నారు. శనివారం ఉదయగిరి ఆర్టీసీ డిపోను సందర్శించి పలు విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలో డిపో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విలేఖరులతో మాట్లాడుతూ నెల్లూరు రీజియన్ పరిధిలో ఆక్యుపెన్సీ రేషియో గతంలో 65 శాతం ఉండగా ప్రస్తుతం 83 శాతానికి పెరిగిందన్నారు. కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్న బస్సు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఎఫ్‌సీకి వచ్చే బస్సులకు నూతన వైరింగ్ చేపడుతున్నామన్నారు. మార్గ మధ్యంలో బస్సులు నిలిచిపోకుండా చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలిస్తున్నామన్నారు. ఉదయగిరి ఆర్టీసీ డిపోలో గతేడాది కేఎంపీఎల్ 5.92 ఉండగా ప్రస్తుతం 5.90 ఉందన్నారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి ఆమె అధికారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు.

వర్షంతో వాహనచోదకుల అవస్థ



నగరంలో శనివారం ఉదయం నుంచి జల్లులు జల్లులుగా వర్షం కురిసింది. దీంతో రోడ్లపై, వంతెనలు, అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిలవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనాలపై వచ్చిన ప్రజలు, ఉద్యోగులు రాకపోకలకు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

\- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్










డ్రైనేజీ కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ

వర్షాలొస్తున్నాయి..
జాగ్రత్తలు తీసుకోండి

● ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తుపాను హెచ్చరికల నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు అధికారులంతా జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రైన్లలో పూడికతీసి వరద ప్రభావం తలెత్తకుండా చూడాలని కమిషనర్ నందన్ సూచించారు. శనివారం నగరంలోని పలు ప్రధాన కాలువలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం మురుగు నీరు సాఫీగా బయటకు వెళ్లే విధంగా పూర్తి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుగా మనుమసిద్దీన్‌నగర్ వద్ద పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాగా వేదాయపాళెం లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అదనపు అంతస్తు పిల్లర్లను సిటీప్లానింగ్ విభాగం అధికారులు తొలగించారు.

● రూరల్లో కంట్రోల్ రూం ఏర్పాటు

దిత్వా తుపాను హెచ్చరికల నేపథ్యంలో నెల్లూరురూరల్లోని గ్రామాలలో అన్ని జాగ్రత్తలు తీసుకునే క్రమంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు రూరల్ తహసీల్దారు కృష్ణప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో తుపాను వల్ల ఇబ్బందులు ఏర్పడితే 9441592127కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఏర్పడిన తెలియచేయాలని తహసీల్దారు విజ్ఞప్తి చేశారు.

నేత్రదానం

నెల్లూరు(వైద్యం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కల్లూరుపల్లి ఆర్టీటీ కాలనీకి చెందిన కే.పెంచలయ్య(42) శుక్రవారం హత్యకు గురవ్వగా మృతుడి కుటుంబ సభ్యులు మల్లయ్య, అరుణాచలం, మురళీకృష్ణల అంగీకారంతో మృతుడి నేత్రాలను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి టెక్నీషియన్ సేకరించారు. కుటుంబ సభ్యులకు నేత్రదాన గుర్తింపు కార్డు అందచేశారు. నేత్రదానం చేయాల్సిన వారు 9959589321కు ఫోన్ చేయాలని తెలిపారు.

నారాయణలో అవగాహన సదస్సు


మాట్లాడుతున్న సివిల్ విభాగాధిపతి డాక్టర్ వెంకటలక్ష్మి

నెల్లూరు(విద్య), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఇంజనీర్స్, బిల్డర్స్, కాంట్రాక్టర్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులుగా హాజరైన నిర్మాణ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని ఉత్తమ ఇంజనీర్‌లుగా ఎదగాలన్నారు. నిర్మాణ రంగానికి ఎప్పటికీ ఆదరణ తగ్గదని, నూతన విధానాలతో నిర్మాణాల ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుందన్నారు. దీనికి అనుగుణంగా సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు తర్ఫీదు పొంది ఆధునిక, సాంకేతిక పద్ధతుల్లో నిర్మాణాలు చేపట్టేలా సంసిద్ధం కావాలని తెలిపారు. అనంతరం నిర్మాణ రంగం, సిమెంట్ రంగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అల్ట్రాటెక్ మేనేజర్ ఎంఎస్.సాయికృష్ణ, డీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా జీఎం పీ.కృష్ణ ప్రసాద్, రామ్‌కోసిమెంట్ మేనేజర్ టీ.సూర్యప్రకాష్, మహాలక్ష్మీ గ్రూప్స్ మేనేజర్ వీ.లలితారామ్, కళాశాల సివిల్ విభాగాధిపతి డాక్టర్ కే.వెంకటలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హజరత్, విభాగాధిపతులు డాక్టర్ ఏవీఎస్.శ్రీధర్, డాక్టర్ జీవీ.రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెంచలయ్యను చంపిన
గంజాయి బ్యాచ్‌ను ఉరి తియ్యాలి

నెల్లూరు(వైద్యం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా కళాకారుడు పెంచలయ్యను చంపిన గంజాయి బ్యాచ్‌ను ఉరి తియ్యాలని సీపీఐ నగర సహాయక కార్యదర్శి సయ్యద్ సిరాజ్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరులో గంజాయి బ్యాచ్ వీరంగం సృష్టిందన్నారు. ఇటీవల పెన్నానదిలో ఇద్దరిని చంపేశారని, తాజాగా ప్రజాకళాకారుడు, కమ్యూనిస్టు నాయకుడైన పెంచలయ్యను అతి దారుణంగా హత్య చేశారని ఆందోళన వక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న పెంచలయ్యను గంజాయి బ్యాచ్ హత్య చేసిన వారిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, సీపీఐ నేతలు షాన్‌వాజ్, లతీఫ్ అహ్మద్, మున్వర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనల వల్ల విద్యార్థులకు వినోదంతోపాటు విజ్ఞానం, వికాసం కలుగుతాయని రామచంద్రాపురం పీఎంశ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేదవతి తెలిపారు. శనివారం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు చెముదుగుంట జిల్లా విజ్ఞానకేంద్రాన్ని సందర్శించారు. రాకెట్ల పనితీరు, విద్యుదుత్పత్తి ప్రాజెక్టులతోపాటు జైన్ దేవాలయం, దొడ్ల డైరీని సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గండికోట సుధీర్‌కుమార్, మున్వర్, బ్రహ్మారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు భవాని, శ్రీలేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)

వినోదం.. విజ్ఞానం.. వికాసం..!



జిల్లా సైన్సు కేంద్రంలో పీఎంశ్రీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంగంలో పెలికాన్ పక్షి

సంగం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెన్నానది ఒడ్డున శనివారం పెలికాన్ పక్షిని గిరిజనులు గుర్తించి రక్షించారు. స్థానికుల ద్వారా ఆత్మకూరు అటవీ రేంజ్ అధికారి శేఖర్‌కు సమాచారం అందించారు. ఆయన ఆదేశాలతో డీఆర్వో నాయబ్ రసూల్ సంఘటన స్థలానికి వచ్చి పక్షిని పరిశీలించారు. సుమారు 4 కిలోల బరువుండే ఈ స్పాట్ బిల్డ్ పెలికాన్ వయసుపై బడటంతో ఎగరలేక ఉందని తెలిపారు. ఈ జాతి పక్షులు ఎక్కువగా సరస్సులు, నదీ తీరప్రాంతంలో నివసిస్తాయని తెలిపారు. సంతానోత్పత్తి కోసం తిరుపతి జిల్లా నేలపట్టు ప్రాంతానికి వస్తాయని, ఈ క్రమంలో నదీ తీర ప్రాంతం వైపు వచ్చి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక పశు వైద్యశాలలో వైద్యం చేయించి సురక్షిత ప్రాంతానికి తరలిస్తామని తెలిపారు. ఆ మేరకు సంగం పశువైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.





పెలికాన్ పక్షికి వైద్యం చేయిస్తున్న పశువైద్య సిబ్బంది

ఉత్సాహంగా విభిన్న ప్రతిభావంతుల క్రీడలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, జిల్లా స్పోర్ట్సు అథారిటీ సహకారంతో జరిగిన విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగాయి. షాట్‌పుట్, రన్నింగ్ రేస్, క్రికెట్, క్యారమ్స్, చెస్ తదితర పోటీలలో తమకెవరూ సాటిలేరంటూ ఆడి బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు మహ్మద్ ఆయూబ్ మాట్లాడుతూ దృష్టి లోపం కలిగిన విద్యార్థులు షాట్‌పుట్, రన్నింగ్ రేస్, క్రికెట్ పోటీలలో పాల్గొన్నారన్నారు. బధిరులు షాట్‌పుట్, రన్నింగ్ రేస్, క్రికెట్, చెస్, క్యారమ్స్ ఆటలలో పాల్గొన్నారని తెలిపారు.



చదరంగం ఆడుతున్న విభిన్న ప్రతిభావంతులు

ఐటీడీఏ పీవో సీఆర్‌డీఏకి బదిలీ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బీ.మల్లికార్జునరెడ్డి డిప్యుటేషన్‌పై సీఆర్‌డీఏకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఐటీడీఏ కార్యాలయం అధికారులు, సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన జిల్లాలో పనిచేసినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళుతున్న ఐటీడీఏ పీవో మల్లికార్జునరెడ్డిని సన్మానించిన అధికారులు, సిబ్బంది

పారా లీగల్ వలంటీర్లు.. న్యాయ సేవలకు వారధులు

నెల్లూరు(లీగల్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్లు ప్రజలకు, న్యాయ సేవలకు మధ్య వారధులని జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.శ్రీనివాస్ అన్నారు. శనివారం పారా లీగల్ వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ శిబిరం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్ భవన్‌లో జరిగింది. శిక్షణ పొందిన పారా లీగల్ వలంటీర్లు సామాన్య ప్రజలకు న్యాయ సహాయం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఉపన్యశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరీ కే.వాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్పరెడ్డి, పారా లీగల్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

ఆటోను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

● మహిళ మృతి, ఏడుగురికి గాయాలు

ఉలవపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆటోను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఏడుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఉలవపాడు జాతీయ రహదారి రాజుపాలెం అడ్డరోడ్డుకు సమీపంలో శనివారం ఉదయం జరిగింది. ఎస్సై అంకమ్మ కథనం మేరకు వివరాలు.. కరేడు పంచాయతీ పరిధిలోని టెంకాయచెట్లపాలెంకు చెందిన మత్స్యకార మహిళలు మండలంలోని రాజుపాలెం గ్రామానికి ఆనుకొని ఉన్న జామాయిల్ తోపులో తుక్కు కట్టె పనులకు వెళ్తుంటారు. రోజూలాగానే శనివారం ఉదయం ఆటోలో బయలుదేరారు. ఈక్రమంలో సాయిబాబా మందిరానికి కూత వేటు దూరంలో కావలి వైపు వెళ్తున్న కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు ముందు వెళుతున్న ఆటోను ఢీకొంది. దీంతో ఆటో రోడ్డు పక్కన ఉన్న ఫెన్సింగ్‌ను ఢీకొంది. దీంతో వాయల లక్ష్మీ(32) ఆటోలో నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలో ఉన్న మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఇద్దరిని కావలి ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా, మిగతా క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. మృతురాలి భర్త పిర్యాదు మేరకు ట్రావెల్ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన లక్ష్మీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అంకమ్మ

రెచ్చిపోతున్న గంజాయి స్మగ్లర్లు

● వరుస ఘటనలతో ఉలిక్కిపడుతున్న జిల్లా ● పోలీసులపైకి వాహనాలు ఎక్కిస్తూ..

● నాలుగు నెలల్లో రెండుసార్లు తుపాకీ పేలుళ్లు ● గంజాయి మత్తులో జంట హత్యలు



నెల్లూరు(క్రైం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్మగ్లర్లు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద గంజాయిను తరలిస్తున్న కారును నిలిపి డీఎస్పీ తనిఖీ చేస్తున్న సమయంలో... స్మగ్లర్లు కారు వేగం పెంచి దూసుకెళ్లారు.ఈ ఘటనలో డీఎస్పీతోపాటు పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. ఆ ఘటన మరువక ముందే నెల్లూరు ఎస్వీజీఎస్ కళాశాల మైదానం వద్ద జాతీయరహదారిపై గంజాయి స్మగ్లర్ కారును చుట్టుముట్టిన పోలీసులను ఢీకొని పరారయ్యేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో ఈగల్ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఇక జిల్లాలో గంజాయి కేసుల్లో సస్పెక్ట్‌షీట్‌లో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన వారు నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గత నాలుగు నెలల్లో గంజాయి స్మగ్లర్లపై రెండుసార్లు తుపాకీ పేలడంతో అందరినీ కలవరపరుస్తున్నది.

● **కానిస్టేబుల్‌ను కారుతో ఢీకొట్టి...**

చెన్నై వైపు ఓ కారులో గంజాయిని తీసుకువస్తున్నారన్న సమాచారం గతంలో ఎస్పీ జీ.కృష్ణకాంత్‌కు అందింది. దీంతో ఆయన బాలాజీనగర్ పోలీసులు, ఈగల్ సెల్‌ను అప్రమత్తం చేశారు. ఇన్‌స్పెక్టర్ కే.సాంబశివరావు తన సిబ్బంది, ఈగల్‌టీమ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌తో కలిసి జాతీయరహదారిపై కాపు కాశారు. పెన్నాబ్రిడ్జికు ముందు కాపు కాసిన పోలీసులు కారును వెంబడించారు. కారు జాతీయరహదారి నుంచి ఎస్వీజీఎస్ కళాశాల వద్ద యూటర్న్ తీసుకొని అక్కడున్న ఇద్దరు వ్యక్తులకు గంజాయి ఇచ్చేందుకు నిందితుడు కారును స్లో చేశాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే కారును చుట్టుముట్టారు. గంజాయిని తీసుకునేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పరరయ్యారు. నిందితుడు తప్పించుకునే క్రమంలో పోలీసులను ఢీ కొడుతూ కారును వెనుకకు వేగంగా రివర్స్ తీసి ముందుకు దూసుకెళ్లాడు. కారు వెనుక ఉన్న ఈగల్‌టీమ్ కానిస్టేబుల్ ఫిరోజ్‌ను ఢీకొనడంతో ఆయన ఎగిరి జాతీయరహదారిపై పడ్డాడు. అదే సమయంలో ఓ లారీ వేగంగా కానిస్టేబుల్ పైకి వచ్చింది అయితే డ్రైవర్ అప్రమత్తమై షడన్ బ్రేకులు వేయడంతో కానిస్టేబుల్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి.

● **జంటహత్యలతో భయాందోళన**

నగరంలోని సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన జంట హత్యలు నగర ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాయి. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలించడంతోపాటు ఆ ప్రాంతంలో వారిని విచారించారు. మృతుల్లో ఒకరు సమీపంలోని పెన్నానదిలోకి వెళ్లే దారిలో గుడారంలో ఉంటున్న పోలయ్య, మరొకరు కడప జిల్లాకు చెందిన శివగా గుర్తించారు. ఈ హత్యలకు పాల్పడిన నిందితులు గంజాయి మత్తులో ఉన్నారన్న ఆరోపణలు వినిపించాయి. గంజాయిని అడ్డుకోవడంలో విఫలం కావడంతో ఆ స్టేషన్ సీఐని వీఆర్‌కు పంపారని సమాచారం.

● **పెంచలయ్య హత్యలోనూ...**

నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం జరిగిన పెంచలయ్య హత్య కేసులోనూ గంజాయి మరకలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. హత్యకు ప్రధాన సూత్రధారిగా కన్పిస్తున్న మహిళ, హత్య చేసిన నిందితులపై నెల్లూరు నవాబుపేట పోలీసు స్టేషన్‌లో గంజాయి కేసులకు సంబంధించి సస్పెక్ట్ షీట్లు ఉన్నాయి. పెంచలయ్య గంజాయి డాన్ కామాక్షితోపాటు వారి గ్యాంగ్‌ను అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించనని గట్టిగా వార్నింగ్ ఇచ్చాడు. దీంతో ఆయన్ను అందరూ కలిసి హత్య చేశారు.

● **మరోసారి తుపాకీ పేలుళ్లు**

ప్రశాంతంగా ఉండే జిల్లాలో నాలుగు నెలల వ్యవధిలో రెండుసార్లు పోలీసు తుపాకీ పేలడం జిల్లా ప్రజలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అందరిని కలవర పెడుతోంది. పెంచలయ్యను హత్య చేసిన నిందితులను పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులపై కత్తితో దాడి చేసిన గంజాయి లేడీ డాన్ తమ్ముడు జేమ్స్‌ను పోలీసులు ఆత్మరక్షణ చర్యల్లో భాగంగా హెచ్చరిస్తూ ఓ సారి గాల్లోకి, మరో సారి జేమ్స్ కాళ్లపై తుపాకీతో కాల్పులు జరిపారు.

● **రాజకీయ నేతల అండ**

జిల్లాలోని గంజాయి ముఠాలకు రాజాకీయ నాయకుల అండదండలు స్పష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో లేడీ గంజాయి డాన్ కామాక్షి నెల్లూరు రూరల్‌కు సంబంధించిన ఓ నాయకుడు ఇంటి ముందు నిత్యం భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేది. ఆ నాయకుడు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లు చేసి మన వారే చూసీచూడనట్లు ఉండమని చెప్పేవారని తెలుస్తోంది. అధికారం మారిన తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ మహిళ పార్టీ మారిన ఓ నాయకుడి అండ చూసుకొని గంజాయి వ్యాపారం సాగిస్తోంది.

13న జడ్పీ సమావేశం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం డీసెంబరు 13న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ, వైద్య, ఆరోగ్యశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, రోడ్లు, భవనాలశాఖలతోపాటు 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలు,2025-26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్ అంచనాలపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు.

నేడు గంధ మహోత్సవం

కావలి (టౌన్) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నాగూరు మీరాస్వాముల గంధం మహోత్సవం ఆదివారం వైభవంగా జరగనుంది. ఉత్తరంపేట ట్రంకురోడ్డు వద్ద ఉన్న జెండా చెట్టు దర్గా గంధ మహోత్సవం ఆదివారం రాత్రి 7 గంటలకు ప్రారంభమై సోమవారం తెల్లవారుజాము వరకు జరుగుందని ఉత్సవ కమిటీ తెలిపింది.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల బాలుర విజేత నెల్లూరు

● బాలికల విజేత తూర్పు గోదావరి ● బహుమతులు పంపిణీ చేసిన సోమిరెడ్డి

పొదలకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు డీఎస్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి రగ్బీ అండర్ -17 పోటీల్లో బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో ప్రకాశం, నెల్లూరు జట్లు తలపడగా నెల్లూరు విజేతగా, ప్రకాశం జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచాయి. అలాగే అండర్-17 బాలికల విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టు విజేతగా, రన్నర్‌గా గుంటూరు జిల్లా జట్లు నిలిచాయి. ఫైనల్ మ్యాచ్‌లో తూర్పుగోదావరి, గుంటూరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరకు తూర్పుగోదావరి విజేతగా నిలిచింది. విజేతలకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. రగ్బీ టోర్నమెంటు ఆర్గనైజర్ పోతురాజు రమేష్ పర్యవేక్షణలో పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ సందర్భంగా ఆయన సోమిరెడ్డి విజేతలకు బహుమతులతోపాటు సొంతంగా నగదు బహుమతులు అందించి క్రీడాకారులను ప్రోత్సహించారు. మొదటిస్థానంలో నిలిచిన జట్టుకు రూ.12 వేలు, రెండో స్థానం రూ.8 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేలు చొప్పున అందించారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, రాష్ట్ర రగ్బీ పోటీల అబ్జర్వర్ నాగమల్లేశ్వరరావు, ఐపీ మహబూబ్‌బాషా, డిప్యూటీ డీఓ వెంకటేశ్వరనాయక్, సెక్రటరీ రమణయ్య, డాక్టర్ దేవిక, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు పులిపాటి వెంకటరత్నం నాయుడు, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, దేవరం రఘురామిరెడ్డి, అమార్థాలూరు చెంచయ్య, గుర్రం మీరా మధు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

3న అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన యాత్ర

నెల్లూరు(వైద్యం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడలో డిసెంబరు 3వ తేదీన అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన యాత్ర నిర్వహిస్తున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి తెలిపారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 11 ఏళ్లుగా అగ్రిగోల్డ్ బాధితులు దాదాపు 11 లక్షల కుటుంబాలు రోడ్డున పడుతుంటే పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో అగ్రిగోల్డ్ బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి పార్టీలకు చలనం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకపోతే కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసేందుకు నిర్వహిస్తున్న అవేదన యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అగ్రిగోల్డ్ బాధితుల పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు రామరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు

వేళకు రారు.. అడిగేవారు లేరు..!

● ఇక శనివారమొస్తే సెలవే..

● ఇదీ ఉదయగిరి ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల తీరు

ఉదయగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అసలే మెట్టప్రాంతం.. ఆపై జిల్లా కేంద్రానికి వంద కిలోమీటర్ల దూరం.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ అసలుండదు.. ఇంకేముంది ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు ఆడిందే ఆట.. పాడిందే పాట.. ఇదీ ఉదయగిరి ప్రభుత్వ కార్యాలయాల్లో వారి పనితీరు.. స్థానికంగా నివాసం ఉండి సకాలంలో విధులకు హాజరు కావాల్సి ఉన్నా ఏ కార్యాలయంలో ఆ పరిస్థితి కనిపించడంలేదు. చాలామంది ఉద్యోగులు సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించడంతో సమయపాలన పాటించడంలేదు. దీంతో కార్యాలయాలు తలుపులు తెరుచుకోకపోవడంతోపాటు వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చిన వారు వారి కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది.

శనివారమొస్తే సెలవే...

పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారి నుంచి సిబ్బంది వరకు శనివారమొస్తే సెలవు పెట్టడం ఆనవాయితీగా మారింది. కొంతమంది ఉద్యోగులు ఉన్నతాధికారుల తనిఖీలు ఏమైనా ఉంటాయోమోనని పేరుకు సెలవు చీటీ రాసి రిజిస్టర్‌లో పెడతారు. అనంతరం వచ్చి ఆ చీటీ చింపేసి ఎంచక్కా సంతకాలు పెట్టేస్తున్నారు. ప్రధానంగా తహసీల్దారు, ఎంపీడీవో, వెలుగు, ఉపాధి, సొసైటీ, ఎంఈవో, హామీ, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ ఈఆర్‌ఏ, హౌసింగ్, వ్యవసాయ శాఖల కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ఎప్పుడు ఉంటారో ఎవరికీ తెలియని పరిస్థితి. సమయపాలన అసలూ పాటించడంలేదు. అవసరమై ఎవరైనా ఏదైనా కార్యాలయానికి వెళితే అక్కడుండే కిందిస్థాయి సిబ్బంది సార్ మీటింగ్ వెళ్లారని, కోర్టుకెళ్లారని షరామామూలుగా సమాధానం ఇస్తున్నారు. తహసీల్దారు కార్యాలయంలో కొంతమంది ఉద్యోగులు యథేచ్ఛగా విధులకు ఎగనామం పెట్టడంపై ప్రజలు బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకపోకపోవడం దారుణం. దీనికితోడు కొన్ని శాఖల అధికారులు వారానికి రెండు, మూడు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నారు. మరికొన్ని శాఖల అధికారులు ఉన్నతాధికారులకు మామూళ్లు ముట్టజెప్పి యథేచ్ఛగా విధులకు రావడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమయపాలన పాటించని, విధులకు ఎగనామం పెట్టే ఉద్యోగులపై చర్యలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు. .



తహసీల్దారు కార్యాలయ ఆవరణలో అధికారుల రాక కోసం వేచి ఉన్న ప్రజలు

హామీ ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపటం ద్వారా వైసీపీ అధినేత జగన్ ఈప్రాంత ప్రజలకు తీరని ద్రోహం చేయగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపి ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచార సమయంలో ఇంటింటికీ వెళ్లినప్పుడు కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలని అడిగారని, అందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చామని గుర్తుచేశారు. ఎన్నికల య్యాక కూడా చంద్రబాబు సహా ముఖ్య నేతలు, మంత్రుల కమిటీకి అనేకసార్లు కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాల్సిందేనని విన్నవించానని ఫలితంగానే ఈ నిర్ణయం జరిగిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తంచేస్తూ డిసెంబరు 1న మధ్యాహ్నం నుంచి కందుకూరులో భారీ ర్యాలీ నిర్వహించబోతున్నట్లు ఇంటూరి తెలిపారు. ఈ ర్యాలీలో కూటమి పార్టీలతోపాటు అన్ని వర్గాలు, రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు భాగస్వామ్యం అవుతాయని ఆయన తెలిపారు. కాగా, కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ అభివృద్ధి విషయంలో జరుగుతున్న ప్రచారాలన్నీ అవాస్తవాలనీ ఆలయ ఆచారాలకు, ఆచారవంతుల సాంప్రదాయాలకు ఎలాంటి భంగం కలిగించటం లేదని, ఆలయానికి ఆదాయం పెంచాలన్న ఆలోచనతోనే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామని చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, రాచగర్ల సుబ్బారావు, మాదాల లక్ష్మీనరసింహం, పూరిమెట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, చిలకపాటి మధుబాబు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, గోచిపాతల మోషే, బెజవాడ ప్రసాదు, షేక్ సలాం, రాయపాటి శ్రీనివాసరావు, రెబ్బవరపు మాల్యాద్రి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

● ప్రైవేటు పాఠశాలల బస్సుల తనిఖీ

కావలి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పాఠశాలల వాహనాలు నడిపితే ఆయా యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ సుందర్ రావు పేర్కొన్నారు. పట్టణంలోని ముసునూరులో శనివారం పలు ప్రైవేటు పాఠశాలల బస్సులను ఆయన తనిఖీ చేశారు. బస్సుల ఫిట్‌నెస్‌తోపాటు, అగ్నిప్రమాదాల నియంత్రణ పరికరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యార్థులకు ఎమర్జెన్సీ డోర్ల వినియోగంపై అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. అనంతరం బస్సుల రికార్డులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌లు, అగ్నిప్రమాదాల నియంత్రణ పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ లక్ష్మీబాయ్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి యూరియా పంపిణీ

ఉదయగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కొట్టాలపల్లి సొసైటీ కార్యాలయంలో రైతులకు సోమవారం నుంచి యూరియా పంపిణీ చేయనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటసామయ్య, సీఈవో పోలయ్యలు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం తీసుకురావాలని వారు కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 12257
వెండి కిలో ధర	రూ. 176300
వెండి ఒక గ్రాము	రూ. 181.30

అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేస్తాం



అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలిస్తున్న ఏపీసీ వెంకటసుబ్బయ్య

ఉదయగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరలో పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని సమగ్ర శిక్ష ఆడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పీ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాటాడుతూ మనబడి-మన భవిష్యత్తు-2 కార్యక్రమంలో భాగంగా జిల్లాకు 1,356 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయన్నారు. వాటిలో 657 భవనాలు పూర్తికాగా 699 భవనాల నిర్మాణం 80శాతం పూర్తయిందన్నారు. పేరెంట్స్ మేనేజ్‌మెంట్ కమిటీ ఖాతాల్లో రూ.6.50 కోట్లు నిధులు ఉన్నాయని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఆ నిధులతో మిగిలిన 20 శాతం పనులు పూర్తిచేసి అదనపు తరగతి గదులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద 46 పాఠశాలలు ఎంపిక కాగా 39 పాఠశాలల్లో నూరు శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పాఠశాలల్లో పూర్తి కావాల్సి ఉందన్నారు. ఉదయగిరి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచికరంగా లేదని, ఒక్క శనివారం మాత్రమే బాగుంటుందని తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోతే ఏజెన్సీని రద్దు చేయాల్సి వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు గుంటుపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఉదయగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గోపికృష్ణ సూచించారు. మండలంలోని వెంగళరావునగర్, గండిపాళెం గ్రామాల్లో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా రెండోరోజైన శనివారం పాఠశాలలు, సచివాలయాల ఆవరణలో మొక్కలు నాటి చుట్టూ కంచెలు ఏర్పాటు చేశారు. అనంతరం ఆయా గ్రామాల అంతర్గత రహదారుల వెంట పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిశుభ్రత పాటించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు సునీత, వెంకటేశ్వర్లు, ఆచార్యులు శోభారాణి, మాధవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలి



సూపర్‌మార్కెట్‌లో క్షేత్ర పరిశీలన చేస్తున్న విద్యార్థులు

ఆత్మకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పలు రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకొని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఒకేషనల్ కోర్సు అధ్యాపకులు రవిశంకర్, భాస్కర్ తెలిపారు. అనంతసాగరం మండలం రేవూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వృత్తివిద్యా కోర్సుల్లో భాగంగా శనివారం ఆత్మకూరు పట్టణంలోని పలు షాపింగ్ మాల్స్, వ్యాపార సముదాయాలలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన వలన వ్యాపార వ్యవహారాలపై అవగాహన కలుగుతుందని ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు రత్నాకర్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు.

ఐటీఐ రహదారి పనుల పరిశీలన



ఐటీఐ కాలేజీకి రహదారి పనులను పరిశీలిస్తున్న అధికారులు

సంగం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమరవునాయుడు కండ్రికలో లగడపాటి వెంకటరామానాయుడు ప్రభుత్వ ఐటీఐ భవనాలకు రహదారి పనులను పంచాయతీరాజ్ ఈఈ సుబ్బరాజు శనివారం పరిశీలించారు. ఈమేరకు ఆయన పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, ఏఈ రమణయ్య ఉన్నారు.

గురుకుల పాఠశాలలో పీఏఎల్ ల్యాబ్ ప్రారంభం

చేజర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లి గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాలలో శనివారం పీఏఎల్ ల్యాబ్‌ను సమగ్ర శిక్షణా అకాడమిక్ మానటరింగ్ అధికారి సుధీర్‌బాబు డిసిఓ ప్రభావతమ్మతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఇందిర, మస్తానయ్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న బోటనీ సబ్జెక్టు అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్సీ బోటనీ పీజీలో 55 శాతం మార్కులు సాధించి నెట్, సెట్ లేదా పీహెచ్‌డీ పూర్తి చేసి అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు సోమవారం ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..!



రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంత

ఉదయగిరి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయ ప్రధాన ఎడమ కాలువపై నిర్మించిన వంతెన ప్రాంతంలో రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఉదయగిరి, వరికుంటపాడు మండలాల సరిహద్దు గ్రామం కావడంతో ప్రతినిత్యం వాహనాలు రద్దీగానే పరుగులు తీస్తుంటాయి. ప్రజలతో పాటు పాఠశాలలు సైతం అటువైపే ఉండడంతో ప్రతినిత్యం విద్యార్థులు కూడా ప్రయాణాలు సాగిస్తుంటారు. అలాంటి తరుణంలో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ఒక్కసారిగా గుంతలోకి దిగడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వర్షాల సమయంలో గుంతలోకి నీరు చేరడంతో అటుగా ప్రయాణాలు సాగించే వాహనదారులతో పాటు ప్రజలకు లోతు తెలియక పోవడంతో పరిస్థితి మరీ దారుణంగా మారుతోంది. దీంతో పగలు ఎలాగోలా ప్రయాణాలు సాగించినప్పటికీ రాత్రి సమయాల్లో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని వాపోతున్నారు. ఇటీవల జరిగిన మరమ్మతు పనులను నాశిరకంగా చేపట్టడంతోనే ఇలాంటి పరిస్థితి దాపురించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పల్లెల్లో స్వచ్ఛ భారత్



బస్టాండ్ సెంటర్‌ను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ఉదయగిరి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్ గ్రామాల్లో శనివారం ఉదయగిరి వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ సేవా పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లోని బస్టాండ్ సెంటర్లు, ప్రధాన కూడళ్లు, వీధులు, నివాస సముదాయాల్లో పేరుకు పోయిన చెత్తా, చెదారాన్ని తొలగించి చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించారు. అలాగే మురికి కూపాలు, నీటి నిల్వ ప్రాంతాలు, అపరిశుభ్ర పరిసరాలను సైతం శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణయ్య, మహబూబ్‌బాషా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు సునీత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పడిపూజ

అనంతసాగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం అయ్యప్పమాల ధరించిన భక్తులు పడిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.

సీపీఎం కార్యకర్త హత్యకు సీపీఐ ఖండన

ఆత్మకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో జరిగిన యువ కళాకారుడు, సీపీఎం కార్యకర్త కె పెంచలయ్య హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అతని హత్యకు కారకులైన వారిని పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

కలువాయిని నెల్లూరులోనే కొనసాగించాలి : పీఆర్టీయూ

కలువాయి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోకి కలువాయి మండలాన్ని మార్పు చేయకుండా నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెవీ నారాయణ, ఐ ప్రసన్నకుమార్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. తిరుపతిలో కలపడం వలన అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతారని తెలిపారు.

నేడు నందిపాడుకు ఎమ్మెల్యే కాకర్ల రాక

దుత్తలూరు(ఉదయగిరి), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు గ్రామ ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన శుద్ధిజల కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ ఉండేలా గురవారెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ



మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

సంగం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో సర్కిల్ పరిధిలోని సంగం, ఏయస్ పేట, చేజర్ల గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలతోపాటు పెన్నానది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షాల వల్ల వాగులు, వంకలు ప్రవహిస్తాయి. సోమశిలకు ఎగువున రాయలసీమ జిల్లాలో భారీ వర్షాలు పడితే సోమశిల జలాశయం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రజలు వాగులు, వంకలు, నదుల వద్దకు, దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. వర్షాల సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కాగా, దిత్వా తుఫాన్ ప్రభావంతో శనివారం సాయంత్రం నుంచి సంగంలో వర్షం కురుస్తోంది. వృద్ధులు, పిల్లలు ఇళ్ల నుంచి బయటకు రాలేక ఇబ్బంది పడ్డారు.

పెన్నా పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చేజర్ల: దిత్వ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేజర్ల తహసీల్దారు ఆర్ మస్తానయ్య తెలియజేశారు. ముఖ్యంగా సోమశిల జలాశయం నుండి ఏ క్షణమైనా పెన్నానదికి నీళ్ళు విడుదల చేస్తారన్న ప్రాజెక్ట్ అధికారుల ఆదేశాలతో చేజర్ల మండలంలో పెన్నానది పరీవాహక గ్రామాలైన కోటితీర్థం గ్రామం నుండి నడిగడ్డ అగ్రహారం వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కావున రాబోవు మూడు, నాలుగు రోజల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీల ప్రారంభం




ఉదయగిరి: క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవోలు

ఉదయగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి ఉపాధ్యాయుల ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు క్రికెట్ పోటీల్లో భాగంగా బ్యాటింగ్, బౌలింగ్ చేసి ప్రారంభించారు. ఉపాధ్యాయినులకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజేత లుగా నిలిచిన జట్లు డివిజన్, అక్కడ నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆట ల పోటీలను సమగ్ర శిక్ష ఏపీసీ వీ వెంకటసుబ్బయ్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గుంటుపల్లి శ్రీనివాసులు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

● **సీతారామపురం:** మండల పరిధిలోని అయ్యవారిపల్లి జడ్పీహైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శనివారం ఉపాధ్యాయులకు మండలస్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. ఈపోటీలను ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, ప్రవీణ, హెచ్ఎం షఫీ అహ్మద్ ప్రారంభించారు. తొలిరోజు మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించగా 20 మంది పాల్గొన్నారు. మండల స్థాయిలో విజేతలైన ఉపాధ్యాయులను జోనల్ స్థాయికి ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు గుర్రంకొండు ఏడుకొండలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ రాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్, బసినేనిపల్లి హెచ్ఎం, తదితరులు పాల్గొన్నారు.

● **వింజమూరు :** మండలంలో శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మెన్ క్రికెట్, ఉమెన్ త్రోబాల్ పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాధికారులు పి రమేష్, ఎం మధుసూదన్‌రెడ్డిలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ మాలకొండయ్య, వివిధ పాఠశాలల పీడీలు, స్కూల్ అసిస్టెంట్‌లు, సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది వై మౌనిక, బి శ్రీహరి, ఎస్‌కె జలీల్, జి హజరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు నాగరాజు

ఉదయగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలని పలువురు అధికారులు సూచించారు. శనివారం మండలంలోని శకునాలపల్లి ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. హక్కులకు భంగం వాటిల్లినప్పుడు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రావు, ఏఎస్‌డబ్ల్యూవో రమణారెడ్డి, పీఆర్ ఏఈ శ్రీనివాసరాజు, ఆర్ఐ అబ్బాస్‌అలీ, హౌసింగ్ ఏఈ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

● **దుత్తలూరు:** మండలంలోని తురకపల్లి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు యనమల నాగరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అందరూ సమానమని, ఎవరి కింద బానిసత్వంగా పనిచేయాల్సిన అవసరంలేదన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చెంచమ్మ, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకంతో ఆర్టీసీకి పెరిగిన ఆదాయం : ఆర్ఎం



ఉదయగిరి: అధికారులతో సమీక్షిస్తున్న ఆర్ఎం షమీమ్

ఉదయగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన స్త్రీశక్తి పథకంతో ఆర్టీసీకి రాబడి పెరిగిందని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ షేక్ షమీమ్ పేర్కొన్నారు. శనివారం ఉదయగిరి ఆర్టీసీ డిపోను సందర్శించి పలు విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలో డిపో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె విలేఖరులతో మాట్లాడుతూ నెల్లూరు రీజియన్ పరిధిలో ఆక్యుపెన్సీ రేషియో గతంలో 65శాతం ఉండగా ప్రస్తుతం 83 శాతానికి పెరిగిందన్నారు. కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్న బస్సు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని ఎఫ్‌సీకి వచ్చే బస్సులకు నూతన వైరింగ్ చేపడుతున్నామన్నారు. మార్గమధ్యంలో బస్సులు నిలిచిపోకుండా చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలిస్తున్నామన్నారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి అధికారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రమేష్‌కుమార్, ఏఎంటీ నాగభూషణం, ఏఎంఎఫ్ నాగరత్నం, జనరల్ ఏడీసీ వెంకటేశ్వర్లు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

జిల్లా కేంద్రమైన నెల్లూరు నుంచి ఉదయగిరికి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతిరోజు రాత్రి 8.30 గంటలకు బస్సు సౌకర్యం కల్పించాలని శనివారం జేవీవీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్ఎం షమీమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు వివిధ పనుల నిమిత్తం ఉదయగిరి ప్రాంత ప్రజలు నెల్లూరుకు వెళుతుంటారన్నారు. 7.45 గంటలకు చివరి బస్సు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 8.30 గంటలకు బస్సు ఏర్పాటుచేస్తే కొంతమేర సమస్య తీరుతుందన్నారు. అలాగే చెన్నైకు సూపర్‌లగ్జరీ, విశాఖపట్నంకు స్లీపర్ బస్సు నడపాలన్నారు. స్పందించిన ఆమె పరిశీలించి ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేవీవీ, ఎమ్మార్పీఎస్ నాయకులు దస్తగిరిఅహ్మద్, బాలగురవయ్య, గురవయ్య, పెంచలయ్య, సురేష్‌కుమార్, రాజాపాల్గొన్నారు.

సీతారామపురం బస్‌స్టేషన్ పరిశీలన

●**సీతారామపురం:** స్థానిక బస్‌స్టేషన్‌ను రీజనల్ మేనేజర్ షేక్ షమీం శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాటాడుతూ సీతారామపురం బస్సు స్టేషన్ ఆధునీకరణ చేసి బస్‌స్టేషన్‌ని వినియోగంలోకి తీసుకొస్తామని, ప్రయాణికులకు అవసరమైన మరుగుదొడ్లను, పలు సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. బస్‌స్టేషన్ ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడతామని తెలిపారు. బస్‌స్టేషన్ ఆధునీకరణపై ఉదయగిరి డిపో మేనేజర్‌కు, సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కె రమేష్ కుమార్, డిపో అసిస్టెంట్ మేనేజర్ నాగభూషణం పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

వదిన, మరదలిపై గొడ్డలితో దాడి



క్షతగాత్రుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి ఎస్సీ కాలనీ సమీప అటవీ ప్రాంతంలో వదిన, మరదలిపై గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేసిన సంఘటన శనివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన పంబా లక్ష్మీనరసమ్మ, జజ్జూరి కవితలు కాలనీ సమీపాన గల అటవీ ప్రాంతానికి కట్టెల కోసం వెళ్లారు. ఈ తరుణంలో వారి వెనుక అటవీ ప్రాంతానికి వెళ్లిన బొబ్బా ఆదినారాయణ వరుసకు వదినైన లక్ష్మీనరసమ్మ, సొంత మరదలైన కవితలపై గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో లక్ష్మీనరసమ్మ, కవితకు తీవ్ర గాయాలు కాగా అతని నుంచి తప్పించుకుని వారు కాలనీకి చేరుకున్నారు. కాలనీ వాసులు 108 వాహనానికి సమాచారం అందించి వారిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చెడు వ్యసనాలకు బానిసైన ఆదినారాయణను వారు మందలిస్తుండడంతో అది మనసులో పెట్టుకుని దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి వైద్యశాలకు చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వకుంటే చంపుతా..

● కత్తితో వదినను బెదిరించిన మరిది

నెల్లూరు(క్రైం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని, లేకుంటే చంపుతానని కత్తితో వదినను బెదిరించిన మరిదిపై సంతపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని సంతపేట కామాక్షినగర్‌లో షేక్ షమీమ్, సతీష్ దంపతులు నివాసం ఉంటున్నారు. కపాడిపాలెం రాయపువీధిలో షమీమ్ మేనత్త ముంతాజ్ నివాసం ఉంటోంది. అప్పుడప్పుడు మేనత్త బాగోగులు చూసుకునేందుకు షమీమ్ కపాడిపాలెం వెళ్లేది. ఈ క్రమంలో ఈనెల 27వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో ఆమె మేనత్తను చూసేందుకు వెళ్లగా అక్కడే ఉన్న మరిది షేక్ సత్తార్ అసభ్యకరంగా మాట్లాడడంతోపాటు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని కూరగాయల కత్తితో బెదిరించడంతో ఆమె భయపడి తన వద్ద ఉన్న రూ.1000 అతనికి ఇచ్చింది. అయితే ఈ విషయమై శనివారం ఆమె సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో బెదిరించి నగదు దోచుకెళ్లాడు...!

నెల్లూరు(క్రైం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పానీపూరి వ్యాపారస్తుడును కత్తితో బెదిరించి నగదు దోచుకెళ్లిన ఘటనపై శనివారం సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు పొర్లుకట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్న సంజయ్ కుమార్ కాపువీధిలో ఆరు నెలలుగా పానీపూరి బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఈనెల 26వ తేది రాత్రి 8 గంటల సమయంలో శివాజీ అనే వ్యక్తి పానీపూరి తిని వంద రూపాయలకు చిల్లర ఉందా అని అడిగాడు. సంజయ్‌కుమార్ గల్లాపెట్టెలో చిల్లరు కోసం చూస్తుండగా శివాజీ కత్తి చూపించి చెంపపై కొట్టి నగదు ఇవ్వాలని బెదిరించాడు. దీంతో ఆయన రూ.2వేల ఇవ్వడంతో అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ మేరకు శనివారం బాధితుడు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమిస్తున్నానని నమ్మించి మోసగించాడు

నెల్లూరు(క్రైం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ యువతిని ప్రేమ పేరుతో వంచించి మోసగించిన యువకుడిపై చిన్న బజారు పోలీసులు శనివారం చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఉస్మాన్‌సాహెబ్‌పేట ప్రాంతంలో నివాసం ఉంటున్న ఓ యువతి డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది. కలిగిరి మండలం నరసారెడ్డిపాలెంకు చెందిన మనోహర్‌తో తొమ్మిది నెలల కిందట పరిచయం అయ్యింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో ఇద్దరు కలిసి ఇంట్లో నుంచి వెళ్లిపోయి వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో సెప్టెంబరు 22వ తేదీన మనోహర్ ఆ యువతిని మోటారు సైకిల్లో ఎక్కించుకుని ముత్తుకూరు బస్టాండు ప్రాంతంలోని ఓ లేడీ హాస్టల్‌లో చేర్పించాడు. మరుసటి రోజు ఆమెను తన గదికి తీసుకువెళ్లి పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబరుచుకున్నాడు. అనంతరం ఆ యువతిని మనోహర్ తన స్వగ్రామానికి తీసుకుని వెళ్లగా అతని తల్లిదండ్రులు త్వరలోనే యువతి తల్లిదండ్రులతో మాట్లాడి పెళ్లి చేస్తామని చెప్పారు. దీంతో మనోహర్ యువతిని ఆత్మకూరు బస్టాండు వద్ద వదిలి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి బాధిత యువతి మనోహర్, అతని తల్లిదండ్రులకు ఫోన్ చేస్తుంటే వారు స్పందించలేదు. దీంతో మోసపోయానని గ్రహించి ఆ యువతి శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైకుల చోరీపై కేసుల నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసిన బైక్‌లను గుర్తుతెలియని దుండగులు అపహరించుకు వెళ్లిన ఘటనలపై చిన్నబజారు పోలీసులు శనివారం కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రంగానాయకులపేట ఇసుకడొంక ప్రాంతానికి చెందిన అబ్దుల్ షరీఫ్ ఏసీ కూరగాయల మార్కెట్‌లో కూరగాయల వ్యాపారి వద్ద గుమస్తాగా పనిచేస్తున్నారు. ఈనెల 17వ తేదీన ఆయన తన బైక్‌ను మార్కెట్ ఎదురుగా పార్క్ చేసి ఉండగా గుర్తుతెలియని దుండగులు అపహరించుకు వెళ్లారు.

● హరనాథపురంకు చెందిన శ్రీనివాసులు ఈనెల 14వ తేదీన సాయంత్రం తన కుటుంబ సభ్యులతో కలిసి బైక్‌పై ఎస్2 థియేటర్‌లో సినిమా చూసేందుకు వెళ్లారు. బైక్‌ను థియేటర్ బయట పార్క్ చేసి సినిమా చూసి బయటకు వచ్చే సరికి బైక్ కన్పించలేదు. ఈ మేరకు బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● హరనాథపురంకు చెందిన శ్రీనివాసులు రామ్మూర్తినగర్‌లో కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తున్నారు. ఈనెల 18వ తేదీన ఆయన కూరగాయాల మార్కెట్ వద్ద బైక్ పార్క్‌చేసి కూరగాయలు తీసుకొని బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● సుందరయ్యనగర్ ఫుత్తాఎస్టేట్ ప్రాంతానికి చెందిన షేక్ అబ్దులా ఏసీ కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 14వ తేది తెల్లవారుజామున ఆయన తన బైక్‌ను మార్కెట్ బయట పార్క్ చేయగా గుర్తుతెలియని దుండగులు అపహరించుకు వెళ్లారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదులపై చిన్నబజారు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 640

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

అల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ నేపథ్యంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురవనున్న కారణంగా మం డల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహ సీల్దారు లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ బయట ప్రాంతాలతో పాటు వాగు లు, నదుల వద్దకు వెళ్లరాదన్నారు. మత్స్య కారు లు వేటకు వెళ్లవద్దని, తీరప్రాంతంలో అప్ర మత్తంగా ఉండాలన్నారు. అధికార యం త్రాంగం నిత్యం అందుబాటులో ఉంటంద న్నారు. వర్షాల వల్ల ఇబ్బందులు ఎదురైతే స్థానిక అధికారులను సంప్రదించాలన్నారు. మరో రెండు రోజుల పాటు సురక్షిత ప్రాం తాల్లోనే ఉండాలని కోరారు.

నేత్రదానం



పసుపులేటి శివకుమార్ (ఫైల్)

కావలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వికృతవారివీధికి చెందిన కావలి రెడ్‌క్రాస్ జీవిత సభ్యుడు పసుపులేటి శివ కుమార్ (56) శనివారం తెల్లవారుజామున తన స్వగృహంలో మృతి చెందాడు. ఆయన సమీప బంధువు పోలు వెంకటగిరిప్రసాద్, రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి ప్రేరణతో మృతుడి భార్య విజయ లక్ష్మి, కుమార్తెలు శ్వేత, శిల్ప అంగీకారంతో శివకుమార్ నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేశారు. స్పెషలిస్ట్ సునీల్ నేత్రాలను సేకరించారు. కుటుంబ సభ్యులకు కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డీ రవిప్రకాష్ నేత్ర దాన ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఇది కావలి రెడ్‌క్రాస్, అభయం సంస్థల ఆధ్వర్యంలో 153వ నేత్రదానమని రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి తెలిపారు.

విద్యుత్ అంతరాయం

బిట్రగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయితీ బేతనీపేటలో శనివారం సాయంత్రం 11 కేవీ విద్యుత్ తీగ తెగిపోవటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ ఏఈ జడరాయ్ సిబ్బందితో కలిసి వెళ్లి మరమ్మతులు చేపట్టారు.

పౌరహక్కుల దినోత్సవం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కొండాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురంలోని ఎస్సీ కాలనీలో ఎంపీడీవో ఆదినారాయణరావు శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ జాగర్లమూడి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు లేనివారికి మంజూరు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్యామ్, వీఆర్వో మాలకొండయ్య, పంచాయతీ కార్యదర్శి రవీంద్ర, ఏపీవో మురళీధరరావు, మాజీ సర్పంచ్ మంచాల ఏడుకొండలు, స్థానికులు వెంకటేశ్వర్లు, వేణు, పాల్గొన్నారు.

అధ్వానంగా పొలాలకు వెళ్లే రోడ్డు

● రైతుల అవస్థలు



గుంతలుపడి బురదమయమైన పొలాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డు

లింగసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగిరేకులపాడు గ్రామానికి చెందిన రైతులు పొలాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డు గుంతలుపడి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డుపై ఉన్న చిన్న చిన్న గుంతలు కాస్తా పెద్దవై దారుణంగా తయారైంది. దీంతో ఈ గ్రామానికి చెందిన రైతులు ఈ రోడ్డుపై మాగాణి భూములలోకి వెళ్లేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. ఈవర్షాలకు రోడ్డుపై ఉన్న గుంతలలో వర్షపు నీరు నిలబడి బురదమయమైంది. దీంతో రైతులు పొలాల్లో వ్యవసాయ పనులు చేసేందుకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు.

ఉదయం 6 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేయాలి

లింగముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేయాలని ఎంపీడీఓ కె శ్రీనివాసులు సూచించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన పింఛన్లు పంపిణీ చేసే సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తేదీ 90 శాతానికి పైగా లబ్ధిదారులకు అంద జేయాలని, మిగిలిన పింఛన్లను 2వ తేదీ పంపిణీ చేయాలన్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 5235 మంది లబ్ధిదారులున్నారని, వీరికి ప్రభుత్వం రూ.2.50 కోట్లు విడుదల చేసిందని ఆయన తెలిపారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక పురోగతి : డీఎస్పీ శ్రీధర్



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీధర్

కావలి (టౌన్) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణతో మహిళలు ఆర్థిక పురోగతి సాధించవచ్చని డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం తుఫాన్ నగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. పీ4 పథకంలో భాగంగా సంస్థ సభ్యులు శ్రీనివాసులు, సాయిచైతన్యల సహకారంతో లలిత జ్ఞాపకార్థం ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జీ సురేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ శ్రీధర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని డీఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మా గార్మెంట్స్ అధినేత ఎం నరసింహారావు, ఈఎన్‌టీ డాక్టర్ విజయభాస్కర్, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల సంఖ్యను పెంచండి

కావలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరులో ఉన్న రెండు రేషన్ షాపుల సంఖ్యను నాలుగుకు పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చాంబర్‌నుంచి కావలి తహసీల్దార్ కార్యాలయానికి గ్రీవెన్స్ ద్వారా ఉత్తర్వులు అందాయి.ఇటీవల మంత్రి లోకేష్ దగదర్తి పర్యటనకు వచ్చినపుడు ముసునూరుకు చెందిన టీడీపీ నాయకుడు బొట్లగుంట శ్రీహరినాయుడు మంత్రిని కలిసి ముసునూరులో రేషన్ షాపుల సంఖ్యను రెండు నుంచి నాలుగుకు పెంచాలని వినతి పత్రం అందజేశారు. దీంతో మంత్రి స్పందించారు.

21 బీఎస్ఎన్ఎల్ టవర్ల మంజూరు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల, తాటికొండ అనూష తతదితరులు

కొండాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గానికి 21 బీఎస్ఎన్ఎల్ టవర్లు మంజూరైనట్లు టెలికాం బోర్డు అడ్వయిజరీ కమిటీ సభ్యురాలు తాటికొండ అనూష తెలిపారు. వింజమూరులోని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ క్యాంపు కార్యాలయంలో జిల్లా టెలికాంబోర్డు అధికారులు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. సెల్ టవర్ల నిర్మాణాలకు స్థలం కేటాయింపుతో పాటు, అన్నిరకాల అనుమతులను సత్వరమే అందించాలని తహసీల్దార్లకు ఎమ్మెల్యే సురేష్ సూచించారు. 21 టవర్ల ఏర్పాటుకు కొండాపురం మండల పరిధిలోని వెళిగండ్ల, శెట్టిపాలెం, మర్రిగుంట గ్రామాలు ఎంపికయ్యాయని అనూష తెలిపారు. మరికొన్ని గ్రామాలలో టవర్లు ఏర్పాటు చేయాలంటూ అధికారులకు వినతపత్రం అందజేశామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ మేనేజర్ ఎం. శ్రీనివాస్, కావలి డీఈ సాయి కుమార్, భాస్కర్, రమేష్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి ఉపాధ్యాయ క్రీడా జట్ల ఎంపిక



మహిళల త్రోబాల్ జట్టుతో ఎంఈవో - 2 ఆనందరావు తదితరులు



బౌలింగ్ చేస్తున్న ఎంఈవో గోవిందయ్య

కావలి (టౌన్) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో శనివారం మండల స్థాయి ఉపాధ్యాయ క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. క్రికెట్, త్రోబాల్ క్రీడాంశాల్లో ఉపాధ్యాయులు, ఉపా ధ్యాయినులకు పోటీలు నిర్వహించారు. ఎంఈవో 1 గోవిందయ్య, ఎంఈవో -2 వెంకట సుబ్బయ్య పాల్గొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమం లో కో ఆర్డినేటర్ చిరంజీవి, జెడ్పీ ఉన్నత ప్రధానోపాధ్యాయుడు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం: మండలస్థాయి ఉపాధ్యాయ క్రీడా జట్లను శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయినులకు త్రోబాల్, ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ఆయా జట్ల ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా కొండాపురం క్లస్టర్ ఉపాధ్యాయుల జట్టు జిల్లా స్థాయి క్రికెట్ పోటీ లకు ఎంపికైంది. మహిళల త్రోబాల్ జట్టుకు ఉత్తమ ప్రతిభ కనబరచిన పలువురు మహిళా ఉపాధ్యాయినులను ఎంపిక చేశారు. ఈ కార్యక్ర మంలో ఎంఈవో-2 ఆనందరావు, కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధాక్రిష్ణ, ఉపాధ్యాయు లు పాల్గొన్నారు.

బిట్రగుంట(దగదర్తి): దగదర్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల క్రికెట్ జట్టు ఎంపిక ఎంఈవో భాస్కర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశ్రామిక హబ్‌గా కందుకూరు : ఎమ్మెల్యే ఇంటూరి



ఉద్యోగ నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కందుకూరు ప్రాంతానికి భారీ పరిశ్రమలు రాబోతున్నాయని, ఈ ప్రాంతం అతిపెద్ద పారిశ్రామిక హబ్‌గా మారబోతున్నదని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి ఇప్పటికీ 40వేల మందికి పైగా వలసలు వెళ్తున్నారని, ఇకముందు ఆ అవసరం ఉండబోదన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం దూరదృష్టితో చంద్రబాబునాయుడు చేస్తున్న కృషి మరువలేనిదని, నేడు ప్రతి గ్రామంలో కనీసం యాభై నుంచి వందమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఉన్నారంటే ఆ ఘనత చంద్రబాబుదేనని వివరించారు. 8సార్లు డీఎస్సీలు నిర్వహించి పెద్దఎత్తున ఉపాధ్యాయ నియామకాలు చేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని, ఈవిడత కూడా అధికారంలోకి రాగానే 16వేల టీచర్ పోస్టులు, 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందని గుర్తుచేశారు. త్వరలో తన స్వంత నిధులతో కందుకూరు నియోజకవర్గ యువతీ యువకుల కోసం మెగా జాబ్‌మేళా ఏర్పాటుచేయించనున్నట్లు నాగేశ్వరరావు వెల్లడించారు. కార్యక్రమంలో శ్రీ గాయత్రీ కాలేజీ కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు, డైరక్టర్ భరద్వాజ, ప్రిన్సిపాల్ గీతాశ్రీనివాసరావు, శ్రీవిద్య హైస్కూల్ కరస్పాండెంట్ రమణయ్య, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సబ్ కలెక్టర్



శంకర్‌నగర్ ఎస్టీ కాలనీవాసులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ హిమవంశీ, తహసీల్దార్ శ్రీనివాసులు

ఉలవపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ రాబోవు రెండు రోజుల్లో తీవ్ర ప్రభావం చూపనున్నందున మండలంలోని తీర ప్రాంతం, లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ సూచించారు. శనివారం ఆయన మన్నేటికోట గ్రామం శంకర్‌నగర్ ఎస్టీ కాలనీవాసులకు తుఫాన్ హెచ్చరికలపై అప్రమత్తంగా ఉండాలని, అధికారులు అన్నివేళలా అందుబాటులో ఉంటారని, ఎలాంటి పరిస్థితులనైన ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు ముందస్తుగా రెవెన్యూ సిబ్బందిని, మండల అధికారులను సహాయక చర్యలకు నియమించినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులు, సహాయ చర్యలు కోసం కంట్రోల్ రూమ్ 8712622676 నెంబరుకు కాల్ చేసి అత్యవసర సేవలు పొందవచ్చన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ టీ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రాళ్లపాడు రోడ్డుపై గుంత

● వాహనదారుల అవస్థలు



రాళ్లపాడు ప్రాజెక్టు పాత స్పిల్‌వే వంతెన వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత

లింగసముద్రం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు పాత స్పిల్‌వే వంతెనను అనుసంధానం చేసే తారు రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వాహనదారులు ఈ గుంతను గమనించకుండా వాహనాలను నడిపితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధి కారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మాలకొండను దర్శించుకున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర

వలేటివారిపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామిని శనివారం ప్రకాశం జిల్లా కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాలువా పూలమాలతో సత్కరించారు. ఆయన వెంట డీసీ చంద్రశేఖర్, సూపరిటెండెంట్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 7,74,586

మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 7,74,586 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 6,650, కుంకుమార్చన ద్వారా రూ. 17,120, వివాహముల ద్వారా రూ. 1,000, తలనీలాలు ద్వారా రూ. 25,825, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 2,63,400, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 460, రూముఅద్దెలు ద్వారా రూ. 27,780, కవర్లు ద్వారా రూ. 8,225, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,10,710, అన్నదానం ద్వారా రూ. 2,10,396, ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ చంద్రశేఖర్ తెలిపారు.

ప్రసాద్ నాయుడు హత్య బాధాకరం



ప్రసాద్ నాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

జలదంకి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు హత్యకు గురవడం బాధాకరమని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం జలదంకి మండలం చింతలపాలెంలో ఆయన స్వగృహానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రసాద్ సోదరుడు వెంకటేశ్వర్లు నాయుడుతో మాట్లాడారు. అనంతరం మేకపాటి మీడియాతో మాట్లాడుతూ ప్రసాద్ మరణం గట్టుపల్లి పంచాయతీ ప్రజలకు, వ్యక్తిగతంగా తనకు తీరని లోటన్నారు. హంతకులను చట్టపరంగా శిక్షించాలని ఆయన కోరారు.

తాళ్ల వెంకయ్య కుటుంబానికి సీపీఎం రాష్ట్ర నేతల పరామర్శ



వెంకయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం రాష్ట్రనేతలు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ పెనుబల్లి సర్పంచు తాళ్ళ వెంకయ్య కుటుంబ సభ్యులను రాష్ట్ర సీపీఎం నాయకుడు వి. శ్రీనివాసరావు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్, సీపీఎం జిల్లా కా ర్యదర్శి మూలం రమేష్ శని వారం పెనుబల్లిలోని తాళ్ల వెంకయ్య నివాసంలో వారి కుటుంబ సభ్యులను పరా మర్శించి వెంకయ్య చిత్రపటానికి జోహార్లు అర్పించారు. గత కొంత కాలంగా తాళ్ళ వెంకయ్య అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందిన విష యం విదితమే. ఈమేరకు శనివారం సీపీఎం రాష్ట్ర నేతలు, జిల్లా కార్యదర్శి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించి వారి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట పలువురు సీపీఎం నాయ కులు, కార్యకర్తలున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

విడవలూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మోంథా తుఫాను కారణంగా స ర్వం కోల్పోయిన వరద బా ధితులను ప్రతిఒక్కరు చే యూతని ఇవ్వాలని స్థాని క ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు మే రకు ఏఆర్డీ స్వచ్ఛంద సం స్థ బాధిత గిరిజనులకు నిత్యవసర సరుకులను అం దజేయటానికి ముం దుకు వచ్చిందని టీడీపీ యువ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఊటుకూరులో ఏఆర్డీ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు శనివారం అయన నిత్యవసరసరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ కోవూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొమరగిరి దయాకర్, గిరిజన నాయకులు కొండా ర ఘు, పుల్లయ్య, వాసు, చౌటూరు శ్రీను,టీడీపీ నాయకులు తూళ్లూరు మాధవ్, ఏఆర్డీ సంస్థ నిర్వాహకులు రమేష్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పచ్చదనం-పరిశుభ్రత

తోటపల్లిగూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎన్‌డీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు మండల పరి షత్ ప్రాథమిక పాఠశాలలో ఎన్ఎస్ఎస్ పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా వివిధ రకాల చెట్లను నాటడం జరిగింది. నాటిన చెట్ల ప్రజలకు ఎంతో ప్రయోజనాత్మకంగా ఉంటాయని, విద్యార్థులు ప్రజలకు చెట్ల ప్రయోజనాలను వివరించారు.

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు



చుండిలో నిరుపయోగంగా ఉన్న చెత్తసంపద కేంద్రం

వలేటివారిపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి, అమ్మపాలెం, పోలినేని చెరువు, లింగపాలెం, జమీన్ ఉప్పలపాడు, కొండసముద్రం, శాఖవరం తదితర గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. సంపద తయారీ కేంద్రాలకు చెత్త రాదు సంపద సృష్టించడం లేదు. గత ఎనిమిదేళ్ల క్రితం గ్రామీణ ఉపాది హామీ పధకం నిధులతో సంపద సృష్టి కేంద్రాలను నిర్మించారు. అప్ప టి నుండి ఇప్పటి వరకూ ఆ కేంద్రాలు వృధాగా పడి ఉన్నాయి. ఒక్కొక్క కేంద్రానికి రూ. 8 లక్షల నుండి రూ 10 లక్షలు ఖర్చు పెట్టి నిర్మించారు. ఈ కేంద్రాల్లో వానపాముల పెంపకం చేపట్టి సేంద్రియ ఎరువులు తయారు చేయాల్సి ఉంది. కానీ అలా జరగడంలేదు. సిమెంట్ తొట్టిలో పిచ్చిమొక్కలు, గడ్డి మొలిచి బీడు భూముల్లాగా మారాయి. అంతేగాకుండా ఆ కేంద్రాలు ఆకతాయిలకు అడ్డాగా మారాయి. మండలంలోని 21 గ్రామ పంచాయతీలు ఉండగా 16 గ్రామ పంచాయతీల్లో చెత్తసంపద కేంద్రాలు ఉన్నాయి. గ్రామాల్లో ఇళ్లలోని చెత్తను గ్రీన్‌అంబాసీడర్లు చెత్తరిక్షాల్లో కేంద్రాలకు తరలించి, సంపద కేంద్రాల్లో తడి పొడి చెత్తను వేరుచేసి వానపాముల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేయాలి. సేంద్రియ ఎరువులను రైతులకు తక్కువ ధరలకు విక్రయించి, వచ్చే ఆదాయంతో పంచాయతీలను అభివృధి చేయాలి. ఈ కేంద్రాలకు చెత్తను తరలించేందుకు ప్రభుత్వం గ్రీన్‌అంబాసీడర్లకు రూ 6 వేలు చెల్లించి నియమించింది. సంపద కేంద్రాలకు చెత్త రాదు. సంపద సృష్టి లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకరావల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శ్మశానంలో వసతుల కరువు



పోకూరు శ్మశానంలో పెరిగిన ముళ్లచెట్లు


వలేటివారిపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు బస్టాండు సెంటరులోని శ్మశానంలో వసతులు కరువయ్యాయి. దీంతో ఆదిఆంధ్ర కాలనీ వాసులు కనీస సౌకర్యాలు లేక అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. శ్మశానంలో ఏళ్ల తరబడి ముళ్లచెట్లు దట్టంగా పెరిగిపోయి అడవిని తలపిస్తోంది. శ్మశానంలోకి వర్షంనీరు చేరి నీటికుంటను తలపిస్తోంది. శ్మశానంలో నిల్వఉన్న వర్షంనీరు నిల్వ ఉండి దుర్వాశన వస్తుందని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. అయినప్పటికీ సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్మశానంలోని ముళ్లచెట్లను తొలగించి, శ్మశానం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి శ్మశానంలో వసతులకు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో ?



అధ్వానంగా ఉన్న ఉప్పలపాడు - కొండసముద్రం మట్టిరోడ్డు

వలేటివారిపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు - కొండసముద్రం మట్టి రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో ఆ మట్టిరోడ్డుపై వెళ్లే వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే చాలు మట్టి రోడ్డుపై వెళ్లే వాహనదారులు బురదలో జారిపడుతున్నారు. మట్టి రోడ్డంతా మోకాటిలోతు గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో వర్షంనీరు చేరి ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలుతున్నారు. ఆ రోడ్డుపై వెళ్లే పాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి రోడ్డును తారురోడ్డుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



దూసుకొస్తున్న దిత్వా

- తుపాను ప్రభావంతో నేడు, రేపు జిల్లాల్లో భారీ వర్షాలు
- ఇస్రో ఉపగ్రహాల ద్వారా సమాచారం
- అప్రమత్తమైన అధికారులు

సూళ్లూరుపేట/కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాను తీరం వైపు దూసుకొస్తోందని, ఆదివారం తెల్లవారుజాము నుంచి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. నైరుతి బంగాళాఖాతం, శ్రీలంకను ఆనుకుని కొనసాగుతున్న తుపాను ప్రస్తుతం పుదుచ్చేరికి 300 కి.మీ, చెన్నైకి 400 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. గడిచిన 4 గంటలుగా 6 కి.మీ వేగంతో కదులుతోంది. తుపాను ప్రభావంతో జిల్లాలో శనివారం ఉదయం నుంచి చలిగాలులతో కూడిన జల్లులు కురిశాయి. పెళ్లకూరులో 32.2మి.మీ, తొట్టంబేడులో 30, డీవీసత్రంలో 26.6, సూళ్లూరుపేటలో 17 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం తెల్లవారుజామున తీవ్ర వాయుగుండంగా మారి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశముంది. దీని ప్రభావంతో చిత్తూరు, తిరుపతి జిలాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. నదులు, వాగులు, వంకలు, చెరువులు, నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం వరకు మత్స్యకారులు పులికాట్ సరస్సు, సముద్రంలోకి చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. నెల్లూరు, ప్రకాశం, అన్నమయ్య, కడప జిల్లాల్లోనూ వర్షాలు కురిసే అవకాశముంది. ఇస్రో సహకారంతో తుఫాన్ ప్రభావం, దాని కదలికలు, సంబంధిత ప్రాంతాల్లో వాతావరణం గురించిన సమాచారాన్ని అధికారులు తెలుసుకుంటూ ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. సెలవుల్లో ఉన్న వారు రద్దు చేసుకుని విధులకు హాజరుకావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా మండల, ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాలని కోరారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. భారీ వర్షాలు కురిస్తే సోమవారం కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్ రద్దు చేయడమేగాక విద్యా సంస్థలకు సెలవు ఇవ్వనున్నట్లు తెలిసింది.

అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రకటన నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. తిరుపతిలో శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. చెరువులు, కాలువలు, వాగులు, వంకల వద్దకు ప్రజలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లు 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సెలవులు రద్దు చేయాలన్నారు.

తూపిలిపాళెం బీచ్‌లోకి అనుమతి లేదు

వాకాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తూపిలిపాళెం సముద్రతీరంలో పర్యాటకులకు అనుమతి లేదని మెరైన్ సీఐ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని బీచ్‌లలో పర్యాటకులను అనుమతించడంలేదన్నారు.

ఆరుగురిపై పీడీ యాక్టు

- గంజాయి, డ్రగ్స్ సరఫరా, విక్రయాల కేసుల్లో..
- త్వరలో మరింత మందిపై ఉంటాయన్న ఎస్పీ


కరణి సాయికుమార్, వంశీ, వేణుగోపాల్, పరందాము, హరి, మురళి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ విక్రయాలు, వినియోగం, రవాణా చేస్తున్న ఆరుగురిపై పీడీ యాక్టు నమోదు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు శనివారం తన కార్యాలయంలో ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అదే సమయంలో డ్రగ్స్, గంజాయి కట్టడికి ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా ఇటీవల ఏడుగురిపై పీడీ యాక్టు నమోదు చేశామని తెలిపారు. ప్రస్తుతం మరో ఆరుగురిపై నమోదు చేశామని వివరించారు. ఇందులో శ్రీకాళహస్తి శ్రీరామనగర్ కాలనీకి చెందిన కరణి సాయికుమార్, బృందమ్మ కాలనీకి చెందిన చెరుకుర్తి వంశీ, వీఎం పల్లెకు చెందిన వేణుగోపాల్, పరందాము, తిరుపతి పద్మావతీపురానికి చెందిన సాడు హరి, తడ గ్రామానికి చెందిన నల్లా మురళి ఉన్నారని తెలిపారు. వీరిపై మాదక ద్రవ్యాలు, గంజాయి, బాంబు ఎక్స్‌ప్లోజివ్స్, ఎర్రచందనం అక్రమ రవాణా, దొమ్మీ, హత్య కేసులు నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీలు కేఎన్ మూర్తి, చెంచుబాబు, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, తడ సీఐలు పాల్గొన్నారు.

అయిననూ పోవలె శ్రీకృష్ణ జన్మస్థానమునకు



"శ్రీవారి సన్నిధిన ఘోర పాపాలు చేసితివి.. కావున పోవలె.. శ్రీకృష్ణ జన్మస్థానమునకు ... నువ్వు లెక్క పెట్టాల్సింది నైలు నదిలోని మొసళ్లు కాదు భూమనా.. జైలులోని దోమలూ, బల్లులు. నీవంటి పాపాత్ములను దేవుడు క్షమించడు."

- తిరుపతిలో మీడియాతో టీటీడీ జాతీయ అధికార ప్రతినిధి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి రామిరెడ్డి



నిండా ముంచేశారు

- నకిలీ వరి విత్తనాలతో నష్టపోయిన రైతుల గోడు
- అనేక మండలాల నుంచి వస్తున్న రైతులు
- పట్టించుకోని వ్యవసాయాధికారులు


మన్నెముత్తేరిలో 20 రోజులకే వెన్ను దశకు చేరిన వరిపంట (ఇన్‌సెట్‌లో) సూళ్లూరుపేట వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద వెన్ను తీసిన వరిపైరును చూపిస్తున్న వరదయ్యపాలెం మండలం కళత్తూరు గ్రామ రైతులు

సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలో నకిలీ వరి విత్తనాలతో రైతులు మోసపోయారంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త సంచలనంగా మారింది. సూళ్లూరుపేటలోనే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. శనివారం సూళ్లూరుపేటలో ఉన్న ఓ ప్రైవేట్ దుకాణం వద్దకు, వ్యవసాయశాఖ కార్యాలయానికి వెన్ను తీసిన వరిపైరును చేతపట్టుకుని 'నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మునిగిపోయాం, న్యాయం చేయండి' అంటూ పలువురు రైతులు వచ్చారు. సూళ్లూరుపేట మండలం నుంచేగాక తడ, దొరవారిసత్రం, వరదయ్యపాలెం, బీఎన్‌కండ్రిగ మండలాల నుంచి ఈ రైతులు వచ్చారు. దుకాణ యజమాని 'మాదేమీ లేదు కంపెనీ వారికి తెలిపాం.. వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రెండు రోజుల తరువాత కొనుగోలు చేసిన బిల్లులు తీసుకుని రండి కంపెనీ వాళ్లు వస్తారు. మాట్లాడతారు' అని సమాధానం చెప్పడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. అక్కడి నుంచి వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఎవరు లేకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

2వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంట

రబీ సీజన్‌లో సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్‌లో దాదాపు 13 వేల హెక్టార్ల పైగా సాగు చేస్తారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా బీపీటీ రకాల పంటను సాగు చేస్తారు. సూళ్లూరుపేటలో ఉండే ప్రైవేట్ డీలర్ల నుంచి సెప్టెంబరు, అక్టోబరు నెలలో బీపీటీ 2782 (జిలకర మసూరా) రకాల వరి విత్తనాలను కొనుగోలు చేశారు. ఈ సీడ్ గోతాలపై అన్నపూర్ణ సీడ్స్ నంద్యాల అని ఉంది. నంద్యాల నుంచి ఈ విత్తనాలను సరఫరా చేశారని డీలర్లు తెలిపారు. ఈ విత్తనాలను సూళ్లూరుపేట మండలంలోనే కాకుండా తడ మండలం కారిజాత, వేనాడు, వాటంబేడు, గొల్లలమొలువు, దొరవారిసత్రంలో కల్లూరు, శ్రీధనమల్లి, పూలతోట, వరదయ్యపాలెం మండలంలో కళత్తూరు గ్రామ రైతులు దాదాపు 500 మందికి పైగా 1,500 వరి విత్తనాల సంచులను కొనుగోలు చేశారు. దాదాపు 2 వేల ఎకరాల్లో నాటిన పైరు 20 రోజులకే వెన్ను తీసి పంట నాశమైపోయింది. నాటిన 20 రోజులకే వెన్ను రావడమేమిటని రైతులు ఆ నోట ఈ నోట చెప్పుకుని నకిలీ విత్తనాలు వల్లేనని తెలియడంతో నిండా మునిగిపోయామని ఆందోళన చెందారు.

పింఛను సొమ్ము విడుదల

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిసెంబరు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లకు గాను 2,62,108మంది లబ్ధిదారులకు రూ.112.69 కోట్లు విడుదల చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 691 గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శుల ఖాతాకు సొమ్ము జమ చేశారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్ద పంపిణీ చేస్తారు. కాగా, తిరుపతి 49వ డివిజన్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ పింఛన్ల పంపిణీలో పాల్గొననున్నారు.

నేడు యూపీఎస్సీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్స్ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఎన్‌ఫోర్స్‌మెంట్, అకౌంట్ ఆఫీసర్స్ పోస్టులకు కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ జిల్లాలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 వరకు నగరంలోని ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూపీఎస్సీ అధికారులు వర్మ, అర్జునకుమార్ పాల్గొన్నారు.

హైవే కూడళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి

- రోడ్ సేఫ్టీ సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల కూడళ్లలో, డాబాలు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్ సేఫ్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి జైలుశిక్ష పడేటట్లు చేయాలన్నారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా చూడాలని,విద్యార్థులకు రోడ్డు భద్రతపై, గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 42 బ్లాక్‌స్పాట్లలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ మౌర్య, ఏఎస్పీ రవిమనోహరాచారి, ఎన్‌హెచ్‌పీడీలు వెంకటేశ్వర్లు, రవీంద్ర, కొండయ్య చౌదరి, జిల్లా రవాణాశాఖ కమిషనర్ మురళీమోహన్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం - పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే విజయశ్రీ

దళితుడని చిన్నచూపా..!

ప్రొటోకాల్ పాటించడం లేదు..మీ ఎస్కార్టు నాకు అవసరం లేదు


డీవీఎంసీ సమావేశంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆక్రోశం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): 'నేను దళితుడిని కాబట్టి నన్ను చిన్నచూపు చూస్తున్నారు.. అధికారులు ప్రొటోకాల్ పాటించనప్పుడు నాకు ఈ ఎస్కార్టు ఎందుకు..' అంటూ సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆక్రోశం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వేదికగా శనివారం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఎన్‌కండ్రిగ మండలం కాంపాళెంలో దళిత కుటుంబంపై దాడి చేయడమేగాక వారిపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడం బాధాకరమన్నారు. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను సురుటుపల్లి ఆలయ బోర్డులో ఎలా నియమిస్తారని నిలదీశారు. అక్కడ ఒక దళితుడైనా ప్రాతినిథ్యం వహించారా అని ప్రశ్నించారు. సత్యవేడు స్పెషలాఫీసర్‌గా ఉన్న వ్యక్తి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని, పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డికి ఉన్న విలువ తనకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక అందజేశారు.

అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించండి

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. డీవీఎంసీలో ప్రస్తావించే ప్రతి అంశానికీ పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములు, ఇళ్ల పట్టాలు వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో నరసింహులు, ఏఎస్పీ రవిమనోహరాచారి, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, ఇతర అధికారులు విక్రమ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.


కుప్పం కుర్రోడి జపాన్ జర్నీ


కలంకారీ గురువు

- వివరాలు 6లో -

గుడిమల్లం ఆలయ అన్నదాన సత్రానికి గ్రీన్ సిగ్నల్



ఏర్పేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన సత్రం నిర్మాణానికి నేషనల్ మాన్యుమెంట్స్ అథారిటీ అనుమతి మంజూరు చేసింది. ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన శివలింగాల్లో ఒకటైన గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. సౌకర్యాల విస్తరణలో భాగంగా కల్యాణకట్ట, పాకశాల, అన్నదాన సత్రం, యాగశాల, రాధాశాల వంటి నిర్మాణాలకు అనుమతుల కోసం ఎంపీ గురుమూర్తి పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి, పురావస్తుశాఖ ఉన్నతాధికారులకు లేఖల ద్వారా వివరించారు. ఆలయ కమిటీ అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి పలు పర్యాయాలు లేఖలు రాశారు. నిర్మాణాల్లో కొంత భాగం ఆలయ రక్షిత ప్రాంతంలోకి వస్తుండటంతో అనుమతులు ఆలస్యమైనా ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో భక్తులకు అత్యవసరమైన తాత్కాలిక అన్నదాన సత్రం నిర్మాణానికి నేషనల్ మాన్యుమెంట్స్ అథారిటీ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేసింది. కాగా, ఆలయాభివృద్ధికి దేవదాయ శాఖ ఇప్పటికే రూ.95లక్షలు సీజీఎఫ్ నిధులు కేటాయించింది.

స్ఫూర్తి



గుడుపల్లె మండలం యామగానిపల్లె స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందిస్తూ

జపాన్ హక్కయిడో యూనివర్శిటీలో పీహెచ్‌డీ రీసెర్చ్ గ్రూప్ సభ్యులతో

కుప్పం కుర్రోడి జపాన్ జర్నీ

SUNDAY SPECIAL

అమ్మానాన్నల వెంట పొలంలో కూలిపనులకు వెళ్లిన పిల్లవాడు... బస్సు క్లీనర్‌గా బతుకును ఈడ్చుకొచ్చిన యువకుడు.. చదువుల వంతెన మీదుగా కుప్పం పల్లెనుంచి జపాన్‌కు ఎగిరిపోయాడు. క్వాంటమ్ సైన్స్ (ప్లాస్మా టెక్నాలజీస్)లో నైపుణ్యం సాధించాడు. పీహెచ్‌డీ పట్టా అందుకున్నాడు. జపాన్‌లో ప్రస్తుతం అధునాతనమైన సెమీకండక్టర్ చిప్ డెవలప్మెంట్‌లో పనిచేస్తున్నాడు. మూలాలు మరచిపోకుండా ఇక్కడి విద్యార్థులకూ మార్గదర్శకుడిగా సేవలందిస్తున్నాడు. గోవిందపల్లె పిలగాడు మురుగేశ్ చదువులయాత్ర విశేషాలు.. ఈ ఆదివారం ప్రత్యేకం..

> మా అమ్మానాన్నలను బెంగళూరునుంచి చెన్నైదాకా విమానంలో తీసుకువెళ్లా. ఈ ప్రయాణం నాకు గొప్ప ఆనందాన్నిచ్చింది. పేదరికం, పల్లె చదువులు.. అని నిరాశ చెందనవసరం లేదు. నిరంతర శ్రమ, పట్టుదల, దృఢ సంకల్పం.. ఇవే నన్ను ఈ స్థితికి చేర్చాయి.

కుప్పం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం, గుడుపల్లె మండలంలో మారుమూల ఉండే గ్రామం గోవిందపల్లె. మురుగేశ్ పుట్టిన ఊరు ఇది. తల్లిదండ్రులు మునస్వామి, యల్లమ్మ బక్క రైతులు. కూలి పనులతోనే జీవనం సాగించేవారు. అమ్మానాన్నల వెంట కూలి పనులకు వెళ్లడం మురుగేశ్‌కూ తప్పేది కాదు. అయితే చిన్నప్పటి నుంచీ చదువులో ముందుండేవాడు. గుడుపల్లె మండలం శెట్టిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 2007-08లో టెన్త్ పరీక్షల్లో 542 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచాడు. ఇంజనీరింగ్ చేయాలన్నది మురుగేశ్ కల. ఇంటర్ చదువులకే ఆర్థిక స్తోమత లేదు. వేసవి సెలవుల్లో బస్సు క్లీనర్‌గా పనిచేస్తూ డబ్బులు పోగేసుకున్నాడు. రోజూ ఇంగ్లీషు పేపర్ కొని క్రమం తప్పకుండా చదివేవాడు.

ట్రిపుల్ ఐటీ దారి చూపింది

పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నాటి ప్రభుత్వం కల్పించిన అవకాశం వరంగా మారింది. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో మురుగేశ్‌కి సీటు లభించింది. అక్కడే ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఇంజనీరింగ్ పట్టా కూడా పొందాడు. ఆ తర్వాత విదేశాల్లో చదవాలన్న కోరికకు పేదరికం అడ్డొచ్చింది. అయినా ఆశ వదులుకోలేదు. పట్టుదలను కోల్పోలేదు. మూడేళ్ల పాటు ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ మద్రాసులలో పరిశోధనా మెలకువలు నేర్చుకుంటూ ఉన్నత చదువులకు తయారవుతూ వచ్చాడు. ఇది మురుగేశ్‌కి గొప్ప ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. మద్రాసు ఐఐటీలో మాస్టర్స్ ఎం.ఎస్. రీసెర్చ్ పట్టా పొందగలిగాడు.

జపాన్‌లో పీహెచ్‌డీ

ఐఐటీ చదువుల నిచ్చిన ఆసరాతో జపాన్ వైపు అడుగులు వేశాడు. పూర్తి స్కాలర్‌షిప్‌తో జపాన్‌లో పీహెచ్‌డీ పట్టా పొందాడు. ఆధ్యాత్మికపరమైన క్వాంటమ్ సైన్స్ (ప్లాస్మా టెక్నాలజీస్)లో పనిచేశాడు. గోవిందపల్లె పిలగాడు.. డాక్టర్ మురుగేశ్‌గా గౌరవం అందుకున్నాడు. జపాన్‌లో అధునాతనమైన సెమీకండక్టర్ చిప్ డెవలప్మెంట్‌లో ఇప్పుడు పనిచేస్తున్నాడు. ర్యాపిడస్ ఇంక్ జపాన్ కంపెనీలో ప్రాసెస్ ఇంజనీరు అతని హోదా.

బీజాలు వేసిన ఫిజిక్స్ టీచర్

ఇదంతా అంత సులువుగా జరగలేదు. కెరీర్‌లో మురుగేశ్ ఎక్కిన ప్రతి మెట్టు వెనుక ఎంతో శ్రమ ఉంది. స్ఫూర్తి నింపి ముందుకు నడిపించిన గురువుల పాత్ర ఉంది.2012లో ప్రాణిక్ హీలింగ్‌ను మురుగేశ్‌కు పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు మీనా పరిచయం చేశారు. ప్రాణిక్ హీలింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు గ్రాండ్ మాస్టర్ చోవా కోక్ సుయ్ శిక్షణా తరగతుల నుంచి, మాస్టర్ డేవిడ్ విజయకుమార్ ద్వారా ప్రేరణ పొందాడు. పీహెచ్‌డీలో కూడా ప్లాస్మా ప్రాసెసింగ్ రీసెర్చ్ సబ్జెక్టును అర్థం చేసుకోవడానికి ఈ ఇద్దరూ దారి చూపారని చెబుతారు మురుగేశ్.

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతూ

మారుమూల గ్రామం గోవిందపల్లె నుంచి జపాన్‌లో ఉన్నతోద్యోగంలో ఉన్న మురుగేశ్ యూట్యూబ్ చానల్ ద్వారానూ, ప్రత్యక్షంగానూ స్ఫూర్తి నింపే పనులు చేస్తున్నారు. భారతదేశంలోను, జపాన్‌లోను వివిధ కళాశాలలు, పాఠశాలలు సందర్శిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్‌లో విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్నారు. తన సొంత మండలమైన గుడుపల్లెలోని విద్యార్థులకూ అండగా నిలుస్తున్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను జపాన్‌లో పరిచయం చేస్తూ, అందులోని విలువలను తెలియజెప్పుతున్నారు.




జపాన్‌లో మన సంస్కృతీ సంబరాలలో

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో ఒక షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,044

తలనీలాలు సమర్పించినవారు: 25,559



అవగాహన ర్యాలీలో సిబ్బంది

ఎఫ్‌పీవోల బలోపేతానికి సహకారం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీమాస్, వాసన్ ఎన్‌జీవోల భాగస్వామ్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. రైతు సంఘాల అభివృద్ధిపై జిల్లాలోని 13 మండలాలకు చెందిన ఏపీఎం, సీసీ, బోర్డు ఆఫ్ డైరెక్టర్ మెంబర్లకు టీటీడీసీలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పీవోల అభివృద్ధికి సెర్ప్, ఎన్ఆర్ఎల్ఎం ప్రాజెక్టు నుంచి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటిద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తామన్నారు. పంటలను నేరుగా అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు విజయలక్ష్మి, సుధాకర్, ఏపీడీ ప్రభావతి, వెంకటేష్, దాక్షాయని పాల్గొన్నారు.

ఎస్వీయూలో 'అన్వేషణ్'



అన్వేషణ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ నరసింగరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం అన్వేషణ్-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ సెనేట్ హాల్లో వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, సీడీసీ డీన్ చెంద్రాయుడు, రీసెర్చ్ డీన్ నరసింహ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తి పెంచి, తద్వారా అనేక సామాజిక సమస్యలకు పరిష్కారం చూపాలని వారు కోరారు. ఆర్ట్స్, సైన్స్, ఫార్మసీ, ఇంజనీరింగ్, హెల్త్ సైన్స్, న్యూట్రిషన్ రంగాల్లో వివిధ కాలేజీల విద్యార్థులు తమ ఆలోచనలకు పోస్టర్, ఓరల్, పేపర్ ప్రెజంటేషన్ రూపమిచ్చారు. వీటిని పరిశీలించిన వీసీ అభినందించారు. ఈ ప్రతిభా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ డీన్ మురళీధర్, కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ పాల్గొన్నారు.

శ్రీసిటీలో ముగిసిన భాగవత సప్తాహ మహోత్సవం

సత్యవేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో చేపట్టిన భాగవత సప్తాహ మహోత్సవం శనివారం ముగిసింది. శ్రీసిటీ - శ్రీవాణి సౌజన్యంతో భాగవత భక్త సమాజ బృందం ఈనెల 23న ఆలయ ఆవరణలో భాగవత సప్తాహ కార్యక్రమం ప్రారంభించారు. 25 మంది సభ్యులు వారం రోజుల పాటు ఉదయం 6 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు భక్తిశ్రద్ధలతో 12స్కంధాలతో కూడిన 335 అధ్యాయాలు, 18 వేల భాగవత శ్లోకాలను పఠనాన్ని ప్రారంభించి ఈనెల 29న శనివారం మధ్యాహ్నం ప్రత్యేక పూజలతో కార్యక్రమాన్ని పూర్తి చేశారు. తమకు ఈ అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చివరి రోజు కార్యక్రమంలో పాల్గొన్న శ్రీసిటీ అధినేత డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి భాగవత భక్త సమాజ సభ్యులను శాలువలతో సత్కరించి స్వామివారి తీర్థ, అన్న ప్రసాదాలను అందజేశారు. శ్రీసిటీ ప్రతినిధులు పీఎస్‌బీ శాస్త్రి, పల్లేటి బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భాగవత సప్తాహ పఠనం చేస్తున్న భాగవత భక్త సమాజ బృందం



నేడు మిస్ యూనివర్స్ ఏపీ సైకిల్ యాత్ర

● శ్రీకాళహస్తి నుంచి మొదలు

శ్రీకాళహస్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నుంచి హైదరాబాద్ వరకు 600 కిలోమీటర్ల మేర మిస్ యూనివర్స్ ఏపీ చందనా జయరామ్ సైకిల్‌యాత్ర జరగనుంది. మహిళ సాధికారత ప్రచార ధ్యేయంతో ఈ యాత్ర సాగుతుంది. పలు ప్రైవేటు సంస్థలు స్పాన్సర్లుగా శ్రీకాళహస్తి నుంచి ఈ యాత్రను ఆదివారం ఉదయం ప్రారంభించనున్నారు. పట్టణంలోని భేరివారి మండపం నుంచి ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ప్రారంభించనున్నారు.

ఐసర్‌తో కలిసి పనిచేస్తాం: టాటా స్టీల్



తిరుపతి ఐసర్‌లో టాటా స్టీల్ రీసెర్చ్ గ్రూప్ చీఫ్ ప్రతీక్ స్వరూప్

ఏర్పేడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐసర్‌తో కలిసి నూతన ఆవిష్కరణల కోసం పనిచేస్తామని జంషెడ్‌పూర్ టాటా స్టీల్ సస్టైనబిలిటీ రీసెర్చ్ గ్రూప్ చీఫ్ డాక్టర్ ప్రతీక్‌కుమార్ దాస్ స్పష్టం చేశారు. శనివారం ఆయన ఏర్పేడు మండలం జంగాలపల్లి వద్ద ఉన్న తిరుపతి ఐసర్‌ను సందర్శించారు. ఐసర్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి డాక్టర్ బలరామన్‌ను కలిశారు. కెమెస్ట్రీ విభాగంలో విద్యార్థులకు అవకాశాల కల్పన, అకడమిక్- ఇండస్ట్రీని సమ్మిళితం చేయడానికి ఐసర్‌తో కలిసి పనిచేస్తామన్నారు. నూతన ప్రాజెక్టులను ఆవిష్కరిచడంలో భాగంగా హైడ్రోజన్ ఉత్పత్తి, స్టోర్డ్‌బయోమాస్, లిక్విడ్ ప్యూయెల్స్ ఉత్పత్తి వంటి అంశాల్లో పరస్పర సహకారం అందించుకునేలా ఐసర్‌తో కలిసి పనిచేస్తామని వివరించారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పంట బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ప్రసాదరావు కోరారు. రబీ 2025-26 సంవత్సరానికిగాను దిగుబడి ఆధారంగా ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ (పునర్వ్యవస్థీకరించ బడిన వాతావరణ ఆధారిత బీమా పథకం కింద) జిల్లాలో వరి, వేరుశనగ పంటలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వరికి గ్రామం, వేరుశనగకు మండలాన్ని యూనిట్‌గా పరిగణిస్తారని పేర్కొన్నారు. వరికి బీమా రూ.42వేలు కాగా ఎకరాకు రైతులు బీమా ప్రీమియం రూ.630, వేరుశనగకు రూ.30వేలు కాగా రూ.450 కట్టాల్సి ఉంటుందని వెల్లడించారు. వరికి డిసెంబరు 31, వేరుశనగకు డిసెంబరు 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్(ఎన్‌సీఐఊఈ)లో బీమాను నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

కావాల్సిన పత్రాలు

పంట బీమా నమోదు చేసుకునే రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, కౌలు రైతులు అయితే సీసీఆర్‌సీపత్రం, రైతు సేవా కేంద్రంలో జారీచేసే పంట సాగు ధ్రువీకరణ పత్రం, రైతు డిక్లరేషన్, ఫోన్ నంబరు, రైతు బ్యాంకు ఖాతా మొదటి పేజీ కాపీని సమర్పించాల్సి ఉంటుంది.

నారాయణవనం తహసీల్దార్ కార్యాలయానికి తాళం

● ఫిర్యాదు చేసిన తహసీల్దార్

నారాయణవనం, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): నారాయణవనం తహసీల్దార్ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు వేశారు. ఈ సంఘటన శనివారం ఉదయం కలకలం రేపింది. నారాయణవనంలో సచివాలయం 3 ఉన్న భవనం కింద అంతస్థులో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 7.30 గంటలకు సిబ్బంది కార్యాలయానికి చేరుకోగా వేరే తాళాలు వేసినట్లు గుర్తించారు. వెంటనే తహసీల్దారుకు సమాచారం అందించారు. తహసీల్దార్ రోజారాణి కార్యాలయానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రవీంద్ర సిబ్బందితో చేరకుని తాళాలు పగులగొట్టి తలుపులు తెరిచారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



తాళాలు వేసియున్న తహసీల్దార్ కార్యాలయం



గౌతమ బుద్ధుని వృత్తాంతం

తమిళనాడులోని దక్షిణ చిత్ర మ్యూజియంలో విజయకుమార్‌చే కలంకారీ శిక్షణ పొందుతున్న యూరప్ వాసులు





కృష్ణ లీలలు

ఆవులకొండ విజయ్‌కుమార్ కన్నుమూత

శ్రీకాళహస్తికి చెందిన ప్రసిద్ధ కలంకారీ కళాకారుడు ఆవులకొండ విజయకుమార్ శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతమైన పెంకులపాడులో ఇంటి వద్దనే ఆయన మృతి చెందారు. కలంకారీ కళాకారుడిగానే కాక, కలంకారీ గురువుగా విజయకుమార్ పేరుపొందారు. దేశ, విదేశాలకు చెందిన ఎందరికో కాళహస్తి కలంకారీ కళను నేర్పించారు. ఎనిమిది పదుల వయసులోనూ కలంకారీ నేర్చుకుంటామని వచ్చే వారికి ఓపిగ్గా నేర్పించేవారు. ఇటీవలే తమిళనాడుకు చెందిన నలుగురు రెండు నెలలపాటు శిక్షణ పొందేందుకు ఆయన వద్దకు వచ్చారు. శిక్షణ పూర్తికాకముందే ఆనారోగ్యంతో ఆయన కన్నుమూశారు. విజయకుమార్‌కు నివాళిగా ఆయన కళాజీవనయాత్ర విశేషాలు..

■ నివాళి

కలంకారీ గురువు



కనకదుర్గమ్మ

1968లో విజయ్ కుమార్ శ్రీకాళహసిలోని కలంకారి శిక్షణ శిబిరంలో విద్యార్థిగా చేరారు. రెండేళ్లపాటు ఎ. మునికృష్ణయ్య, రమణయ్య, రాంబోజి నాయక్ వద్ద శిక్షణ పొందారు. ఆ తర్వాత అదే శిబిరంలో నాలుగు సంవత్సరాల పాటు బొమ్మలు గీసే కళాకారుడిగా శిక్షణ ఇస్తూ, పని చేశారు. రోజువారి వేతనంపై కలంకారి బొమ్మలు గీశారు. 1976 నుంచి ఈ శిక్షణ శిబిరం అనేక ఆటుపోట్లు ఎదుర్కొని 1988లో శాశ్వతంగా మూతపడింది. ఆ తర్వాత ఆయన కలంకారీ చిత్ర రచనమీదకన్నా శిక్షణ మీద ఎక్కువ దృష్టి పెట్టారు. స్థానికులే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి సైతం ఔత్సాహికులు ఆయన వద్ద శిక్షణ పొందారు.ఫ్రాన్స్ దేశం నుంచి ఆండ్రే దంపతులు ప్రత్యేకంగా ఏడాదిలో వారం రోజులు శ్రీకాళహస్తిలో ఉంటూ పది సంవత్సరాలు పాటు విజయ్ కుమార్ వద్ద కలంకారీ రాతపని నేర్చుకున్నారు. శ్రీకాళహస్తిలో ఎన్నో శిక్షణా శిబిరాలు నిర్వహించారు. కావలిలో రెండు బ్యాచ్‌లకు ట్రైనింగ్ ఇచ్చారు. తమిళనాడు మహాబలిపురం రోడ్‌లోని దక్షిణచిత్ర మ్యూజియంలో 2000 సంవత్సరం నుంచి 2020 వరకు కలంకారి గురువుగా వారాంతపు రోజుల్లో పలువురికి నేర్పించారు. యూరప్ ఖండం నుంచి 14 దేశాలకు చెందిన కళాభిమానులు ఈయన వద్ద కలంకారీ నేర్చుకున్నారు. వారానికి ఒక రోజు బెంగళూరులోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలోనూ, మరొక రోజు చెన్నైలోని నిఫ్ట్ కళాశాలలోనూ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేవారు. కరోనా తర్వాత తన శిక్షణా కార్యక్రమాలను శ్రీకాళహస్తిలోని ఇంటికే పరిమితం చేసుకున్నారు. నాలుగేళ్లుగా చెన్నై ఫైనార్ట్స్ కళాశాల విద్యార్థులు శ్రీకాళహస్తికే వచ్చి శిక్షణ పొందేవారు. శ్రీకాళహస్తిలో కరుణ అనే పేరుతో కలంకారీ కళాకారుల సంక్షేమ అసోసియేషన్ కూడా ఆయన ఏర్పాటు చేశారు. కలంకారీ కళాకారుడిగా విజయ్‌కుమార్ భారతం, రామాయణం, కృష్ణ లీలలు, భాగవతం, గౌతమ బుద్ధుని వృత్తాంతం, అష్టలక్ష్మి, దశావతారాలు వంటి ఇతిహాస చిత్రాలను కలంకారీలో గీశారు. 55 ఏళ్ల క్రితం కలంకారి వృత్తి నేర్చుకున్న తొలి నాళ్లలో వేసిన కనకదుర్గమ్మ, గీతోపదేశం, గౌతమ బుద్ధ వృత్తాంతం చిత్రాలను మాత్రం ఇప్పటికీ బాల్యానికి గుర్తుగా తన వద్దే భద్రపరచుకున్నారు. 'హస్త కళల్లో కలంకారీ ఒక అద్భుతం. వస్త్రంపై బొమ్మలు గీసి సహజ సిద్ధమైన ప్రకృతి రంగులను అద్దటం పురాతన ప్రక్రియ. యాంత్రీకరణ ఎప్పటికప్పుడు అన్ని రంగాలపై ప్రభావం చూపుతున్నా కలంకారీ హస్తకళకు మాత్రం ఆదరణ తగ్గలేదు.' అని ఆయన చెప్పేవారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి


ప్రమాదంలో గాయపడిన పద్మావతి, శ్రీనివాసరావు

లారీని ఢీకొన్న కారు

ఐదుగురికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారి సమీపంలో లారీ కారును ఢీకొన్న సంఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరు ప్రాంతానికి చెందిన అయ్యప్పస్వామి భక్తులు కారులో శబరిమలై వెళ్లారు. స్వామివారి దర్శనానంతరం స్వస్థలానికి వెళ్తుండగా ఆదివారం అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారి సమీపంలో ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో పద్మావతి, శ్రీనివాసరావు, భరత్, మణికంఠ, సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌బీకేఆర్‌లో వాలీబాల్ జట్ల ఎంపిక


వాలీబాల్ క్రీడాకారులతో డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు

కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం అనంతపురం జేఎన్‌టీయూ పరిధిలో జరిగే వాలీబాల్ పోటీలకు సంబంధించి జట్లను ఎంపిక చేశారు. పురుషుల విభాగంలో 150 మంది, మహిళల విభాగంలో 50 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. పరిశీలకుడుగా డాక్టర్ నారాయణరెడ్డి వ్యవహరించారు. డిసెంబరులో కాకినాడ జేఎన్‌టీయూలో వాలీబాల్ పురుషుల టోర్నమెంట్, చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో మహిళల టోర్నమెంట్ జరుగనున్నాయి. కార్యక్రమంలో ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి


రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్

వాకాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డీలర్లు సక్రమంగా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ అన్నారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతినెలా 1నుంచి 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. తక్కువ తూకాలతో పేదలను మోసం చేస్తే కేసులు నమోదు చేయడంతోపాటు డీలర్ షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అఖిల్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి పెట్టండి

వాకాడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో పాటు వెలుగు వీవోఏలు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో సాయిప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు వీవోఏలతో టీమ్-5 సమీక్షా సమావేశం చేపట్టారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, డ్రైనేజీ, వ్యవస్థ నిర్వహణపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సత్కారం


అల్లాభక్షుకు జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు

కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన అల్లాభక్షు అభినందన సభ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగింది. పంచాయతీ కార్యదర్శుల తరపున అల్లాభక్షుకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. అల్లాభక్షు సేవలను ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, డిప్యూటీ ఎంపీడీవో వేణు కొనియాడారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

నాయుడుపేట టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ బస్సులు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూళ్లూరుపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ హెచ్చరించారు. శనివారం నాయుడుపేట - శ్రీకాళహస్తి జాతీయ రహదారి కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలకు చెందిన బస్సులో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తుండడం, అత్యవసర ద్వారాలు తెరుచుకోకపోవడం, అగ్నిమాపక పరికరాలు పనిచేయకపోవడం గుర్తించారు. రికార్డులు సైతం సక్రమంగా లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు అనిల్‌కుమార్ తెలిపారు.

గిరిజనకాలనీలో సివిల్ రైట్స్ డే


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ హరికృష్ణ

పెళ్లకూరు, నవంబరు 29: మండలంలోని కొత్తూరు గిరిజన కాలనీలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు హరికృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాలు, పౌర హక్కుల గురించి వివరించారు. అంటరానితనాన్ని నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఎంఈవో శంకరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్ కుమార్, సీహెచ్‌వో వెంకటకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిప్రియ, టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్టేడులో...

కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు దళితవాడలో శనివారం సివిల్స్ రైట్స్‌డే జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, సీడీపీవో మునికుమారి పౌరహక్కుల గురించి వివరించారు. దళిత గిరిజనులకు ఉన్న హక్కులు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానికులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుచేంద్రప్రసాద్, వార్డెన్ ఉషారాణి, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

సూళ్లూరుపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి శనివారం కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన ఎర్రమల చంద్రశేఖర్ రెడ్డి రూ.1,00,001 విరాళంగా అందజేశారు. సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కామేశ్వరరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.


సహాయ కమిషనర్‌కు చెక్కు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి



అక్కగారిపేట వద్ద పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు - జీలపాటూరులో వరినాట్లు వేస్తున్న కూలీలు

సంమృద్ధిగా వర్షాలు.. ఆశాజనకంగా రబీ సాగు

పెళ్లకూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాధారణం కంటే అధికంగా కురుస్తున్న వర్షాలతో ఈ ఏడాది రబీసాగు ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతల్లో ఆనందోత్సాహం నెలకొంది. గతంలో సరైన వర్షాలు లేకపోవడంతో సాగు విస్తీర్ణం చాలా తక్కువగా ఉండేది. గత ఏడాది మండలంలో వరిసాగు 11 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే రైతులు దాదాపు 12 వేల ఎకరాలకు పైగా వరిసాగు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతులు 8 వేల ఎకరాల్లో వరినాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. రబీ సాగుకు అనుకూలంగా వర్షాలు కురవడంతో స్వర్ణముఖినది, మామిడి కాలువల్లో నీరు పుష్కలంగా ప్రవహిస్తోంది. చెరువులు, వాగులు, వంకలు నిండుకుండల్లా మారాయి. భూగర్భజలాలు భారీగా వృద్ధి చెంది బోరుబావుల్లో నీటి మట్టం పెరిగింది. రబీ సీజన్‌లో అధిక దిగుబడులు పొందుతామనే నమ్మకంతో రైతులు ఉన్నారు.

నెల్లూరు జిల్లాలో గూడూరును విలీనం చేయాలి

గూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో గూడూరును విలీనం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో విద్యార్థులతో కలిసి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చి విస్మరించడం తగదన్నారు. గూడూరు ప్రజల మనోభావాలకు అనుగుణంగా నెల్లూరు జిల్లాలో కలపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఖాదర్, మస్తాన్, నవీన్, వంశీ, విద్యార్థినులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు సూళ్లూరుపేట ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఆర్డీవో కిరణ్మయి సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దన్నారు. నదిపరివాహక ప్రాంతాల వైపు రైతులు, ప్రజలు వెళ్లవద్దన్నారు. తహసీల్దార్, మున్సిపాలిటీ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామని, ప్రజలకు ఏ అవసరమొచ్చినా ఫోన్ చేయవచ్చునన్నారు. తీరప్రాంత గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని వట్రపాలెం వాసులను అవసరమైతే పునరావాస కేంద్రానికి తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

తడ: దిత్వా తుఫాన్ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సూచించారు. నేడు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు. తుఫాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, సచివాలయాల పరిధిలో ఐదుగురు అధికారులను నియమించామని, వారు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారని, వీరితో పాటు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సూళ్లూరుపేటలో అందుబాటులో ఉంటుందని ఎంపీడీవో శేఖర్‌నాయక్ తెలిపారు.

వెంకటగిరి: దిత్వా తుఫాన్ కారణంగా గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల క్లస్టర్, యూనిట్, బూత్, వార్డు, గ్రామ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అదేవిధంగా అధికారులకు ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియ పరుస్తూ సహకరించాలని సూచించారు.

చిల్లకూరు: తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు తీరప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

వెంకటగిరి టౌన్: దిత్వా తుఫాన్‌గా బలపడడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు నరసింహారావు, సీఐ రమణ కోరారు. మూడు రోజులు పాటు తుఫాను తీవ్ర ప్రభావం చూపించనుందని లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని కోరారు.

యూరియా పంపిణీ


యూరియా పంపిణీ చేస్తున్న రామచంద్రయ్య నాయుడు

డక్కిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదవాయపాళెం సింగిల్ విండో అధ్యక్షుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు శనివారం కమ్మపల్లిలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని చెప్పారు. యూరియా కొరత ఉందంటూ కొందరు వైసీపీ నేతలు పనిగట్టుకొని ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పోకూరు రమేష్ నాయుడు, పీపీ చౌదరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కురుగొండ ఉన్నత పాఠశాలలో 'బేటీ బచావో - బేటీ పఢావో'


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం వెంకటేశ్వర్లు

ఓజిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండ ఉన్నత పాఠశాలలో శనివారం అంగన్వాడీ కార్యకర్తల అధ్వర్యంలో 'బేటీ బచావో - బేటీ పఢావో' కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం, గుడ్‌టచ్ - బ్యాడ్‌టచ్ వంటి అంశాలను వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి ప్రధానోపాధ్యాయుడు తీపలపూడి వెంకటేశ్వర్లు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునిరాజ, అంగన్వాడీ కార్యకర్తలు సుహాసిని, అనూషా, రాజేశ్వరి పాల్గొన్నారు.

రైలులో ప్రసవం

సూళ్లూరుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి పాట్నా(దనాపూర్) వెళుతున్న సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌లో శనివారం రాత్రి ఓ మహిళ ప్రసవించింది. బీహార్ రాష్ట్రంలోని దనాపూర్‌కు చెందిన కుష్బుకుమారి తన భర్త పంకజ్‌రాజ్‌తో కలిసి చెన్నై పెరంబూదూరు నుంచి దనాపూర్ వెళ్లేందుకు శనివారం సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. రైలు సూళ్లూరుపేటకు కొంత దూరంలో ప్రయాణిస్తుండగా కుష్బు కుమారికి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని భర్త తోటి ప్రయాణికుల సాయంతో రైలు గార్డు దృష్టికి తీసుకెళ్లాడు. పురిటినొప్పులు ఎక్కువ్వడంతో రైలును సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో నిలిపివేసి 108కు సమాచారం ఇచ్చారు. 108 వాహనం వచ్చే సరికే రైలు బోగిలోనే మహిళా పడంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వెంటనే తల్లి, బిడ్డను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సూరింటెంటెండ్ రమేష్ తల్లి బిడ్డను పరీక్షించి ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

గూడూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగం థియేటర్ సెంటర్‌లో శనివారం హీరాబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు కంకణాల పెంచలనాయుడు మాట్లాడుతూ చలికాలంలో పేదలకు ఇబ్బంది లేకుండా ఉండాలనే ఉద్దేశంతో దుప్పట్లు అందజేశామన్నారు.

బాలిరెడ్డిపాళెంలో మహిళలకు...

వాకాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలో ఉన్న పట్టాభిరామాలయంలో శనివారం పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టాభిరామాలయ వేదాంతి దివి అనంతాచార్యులు, కొడవలూరు భక్తవత్సల రెడ్డి, షిరిడీసాయి అక్షయ సేవాసమితి సభ్యులు పన్నాగ సాయి, జంపలూరు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వెంకటగిరి, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరసింహారావు వీధిలోని ఆటో కార్మికుడు తులసి నటరాజా అనారోగ్యంతో బాధపడుతుండటంతో శనివారం శ్రీకృష్ణ దేవరాయ కాపు, బలిజ సేవా సంఘం సభ్యులు రూ.11వేలు అందజేశారు.

చిల్లకూరులో...

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరు అరుంధతీయవాడకు చెందిన రమణయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల కోసం టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ సహకారంతో మాజీ సర్పంచు రామ్మూర్తి, టీడీపీ నేతలు రవి, చిన్నయ్య, వెంకటరాగయ్య మూడు వేలు అందజేశారు.

దాడి ఘటనలో ఆరుగురి అరెస్టు

తడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దాడి ఘటనలో ఆరుగురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. మండల పరిధిలోని గ్రద్ధగుంటకు చెందిన ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేటకు చెందిన కౌన్సిలర్ శరత్ గౌడ్‌కు మధ్య వ్యాపార లావాదేవీల విషయమై విబేధాలు ఉన్నాయి. గురువారం రాత్రి శరత్ గౌడ్ స్నేహితులతో కలిసి గ్రద్ధగుంటలో ప్రవీణ్ కుమార్ ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడ అతను లేకపోయే సరికి వాచ్‌మెన్ వెంకయ్యపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శరత్ గౌడ్, అతని స్నేహితులైన దిలీప్, వెంకటరమణ, ప్రేమ్‌కుమార్, మురళితో పాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ శివశంకర్

డక్కిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ శివశంకర్ అన్నారు. మండలంలోని శ్రీపురం దళితవాడలో శనివారం సివిల్స్ రైట్స్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ కక్షలు విడనాడి, వివాదాలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం సాగించాలని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి మాట్లాడుతూ రెవెన్యూ సేవలు ఏ విధంగా పొందాలో వివరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పెంచలయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం

వెంకటగిరి, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన శనివారం స్వల్ప వివాదాల నడుమ ప్రశాంతంగా జరిగింది. సమావేశం ప్రారంభంలోనే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిరసిస్తూ 4వ వార్డు కౌన్సిలర్ ప్లకార్డులతో నిరసన తెలిపారు. వార్డుల్లో సమస్యలను పరిష్కరించడంలేదని విమర్శలు గుప్పించారు.

అన్నదానం

నాయుడుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు అన్నమనేని నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు అన్నమనేని సాయి అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు మురళీధర్, శ్రీను, సుబ్బారావు, నిత్యకృష్ణారెడ్డి, జీవీఆర్ నాయుడు, మస్తాన్, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా బీటీఏ కమిటీ ఎన్నిక


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీటీఏ సభ్యులు

కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ కాలనీలో శనివారం బహుజన టీచర్స్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. కోట మండల బీటీఏ గౌరవ అధ్యక్షుడుగా మట్టిగుంట ప్రభాకర్, గౌరవ సలహాదారుడుగా గిరిప్రసాద్, అధ్యక్షుడుగా డేగా సుబ్రహ్మణ్యం, అసోసియేట్ అధ్యక్షుడుగా తిరుమల శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుడంగుంట రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా పేర్నాటి నాగరాజు, అదనపు కార్యదర్శిగా మువ్వల జనార్దన్, ఆర్థిక కార్యదర్శిగా ఏకుల నాగరాజ, ఆడిట్ కార్యదర్శిగా మల్లాపు వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహిళా కార్యదర్శులుగా కల్లు సంపూర్ణమ్మ, ఎం. సులోచనారాణి, ఏలూరు శ్రీలతతో పాటు జిల్లా కార్యదర్శులుగా వెంకటకృష్ణయ్య, మట్టిగుంట శ్రీనివాసులు, పేర్నేటి రమణయ్య, వాటంబేటి సుబ్బారావు, కాకుమూరి సునీల్‌కుమార్, ఫురిణి హరినాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్త కమిటీ చేత బీటీఏ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్.చక్రవర్తి ప్రమాణం చేయించారు.

రక్తదాన శిబిరం

కోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడులో శనివారం ఎంవీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. పలువురు యువకులు రక్తదానం చేశారు. గూడూరుకు చెందిన మేడీపల్స్ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, శివకుమార్ చేతుల మీదుగా ప్రసంశాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంవీరావు ఫౌండేషన్ ప్రతినిధులు లీలామోహన్‌కృష్ణ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.